


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 11.02.2026 | సంపుటి : 3 | సంచిక :11 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Wednesday | 11.02.2026 | volume : 3 | Issue : 11 | Pages : 8 | Cost : 2/-



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


# తెలంగాణలో నేడు పుర పోరు

## 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్

భారీగా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పోలీసుల భద్రత

మక్తల్ ఆరోవార్డు బిజెపి అభ్యర్థి ఆత్మహత్యతో ఎన్నిక వాయిదా

తెలంగాణ రాష్ట్రంలో బుధవారం మున్సిపల్ ఎన్నికలు జరుగ నున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అయితే...నారాయణపేట్ జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో ఆరోవార్డు ఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహదేవ్ ఆత్మహత్యతో ఎన్నికను రద్దు చేస్తున్నట్టు తెలిపింది. ఎన్నికలకు ఒక్క రోజు ముందే అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే ఎన్నికల సిబ్బంది తమ సరంజామాతో తమకు కేటాయించిన బూతలకు చేరుకున్నారు.




**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో బుధవారం పోలింగ్ జరుగనున్నది. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్నది. సాయంత్రం 5 వరకు పోలింగ్ జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. ఈ నెల 13న ఓట్ల లెక్కింపుతో ఫలితాలు వెల్లడికానున్నాయి.. ఆ రోజే నగర, పట్టణ ప్రజానీకం ఎవరి వైపు మొగ్గు చూపిందనే ఉతంతకు తెరపడనున్నది. జిల్లాలవారీగా ఏర్పాటు చేసిన

-మిగతా 2 లో..



# నిధుల్లో కోత.. ఫెడరలిజంపై దాడే

సొమ్ములు మావి... గొప్పలు మీవా.?

ప్రతిసారి మేమిచ్చాం, మేము తెచ్చాం కాదు

అది తెలంగాణ ప్రజల సొమ్ము

తెలంగాణ కేంద్రానికి ఇచ్చేది 1,33,208 కోట్లు...

కేంద్ర పథకాలతో కలిపి ఇచ్చింది 51 వేల కోట్లు మాత్రమే

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 10 : కేంద్ర ఆర్థిక విధానాల వల్ల దేశానికి అధికంగా ఆదాయం సమకూరుస్తున్న దక్షిణాది రాష్ట్రాలు అన్యాయానికి గురవుతున్నాయని, ఇది కేవలం ఆర్థిక వివక్షే కాదు, రాజకీయ ఉద్దేశంతో కూడిన వివక్ష అని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

-మిగతా 2 లో..



# స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం

నోటీసులో సాంకేతిక లోపం.. సవరించి అందచేత

న్యూఢిల్లీ,ఫిబ్రవరి10 : లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస ఖతీర్మానం ప్రవేశపెట్టేందుకు మంగళవారంనాడు ఇచ్చిన నోటీసులో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఆ లోపాన్ని సరిచేసి విపక్ష ఎంపీలు తిరిగి నోటీసును లోక్‌సభ సెక్రటరీకి అందజేశారు. విపక్షాల నోటీసును పరిశీలించాల్సిందిగా లోక్‌సభ సెక్రటేరియట్‌ను ఓం బిర్లాను ఆదేశించడంతో ఈ సాంకేతిక లోపం బయటపడింది. విపక్షాలు మొదట ఇచ్చిన నోటీసులో 2026 సంవత్సరానికి బదులుగా 2025 సంవత్సరం అని

-మిగతా 2 లో..

# బాబుకు గురుదక్షిణ సమర్పిస్తున్న రేవంత్


## అక్రమంగా కృష్ణా నీటిని తరలిస్తున్న ఆంధ్రా

చోద్యం చూస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

మాజీమంత్రి హరీష్ రావు తీవ్ర ఆరోపణలు

కృష్ణా నదీ జలాలను ఏపీ అప్పనంగా తీసుకుపోతున్నదని.. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చోని చోద్యం చూస్తున్నాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. తాను పూర్తి ఆధారాలతో మాట్లాడుతున్నానని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్ రావు అన్నారు. ఏపీ ఇష్టారాజ్యంగా కృష్ణా నీళ్లను తీసుకుపోతున్నది. తెలంగాణ ఇరిగేషన్ శాఖ కేఆర్ఎంబీకి రాసిన లేఖ ఇది. దీని ప్రకారం 664 టీఎంసీలు అంటే 80శాతం నీళ్లు ఏపీ వాడుకున్నది. 02





# వాన్‌పిక్ ప్రాజెక్ట్‌కు సుప్రీంలో ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 : వాన్‌పిక్ ప్రాజెక్ట్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సీబీఐ నమోదు చేసిన కేసును కొట్టివేయాలన్న పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థ నమోదు చేసిన అభియోగాలను సీబీఐ ప్రత్యేక కోర్టు

-మిగతా 2 లో..

# హరీష్, రేవంత్ మధ్య ఉన్న బంధం ఏమిటో?

సిద్దిపేటకే నిధులు విడుదలలో ఆంతర్యం

మరోమారు విమర్శలు గుప్పించిన కవిత

కేవలం సిద్దిపేటకే నిధులు విడుదలలో ఆంతర్యం ఏమిటని, హరీష్ రావు, సిఎం రేవంత్ మధ్య ఉన్న బంధం ఏమిటో చెప్పాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మున్సిపల్ బూతుల వర్షం ఆగిపోవడం సంతోషంగా ఉందని కల్వకుంట్ల కవిత అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం చూశాక.. పార్టీ గుర్తులు లేకుండా ఎన్నికలు జరిగితే బాగుండేదని కవిత అభిప్రాయపడ్డారు.



హైదరాబాద్, ఫిబ్రవరి 10 : ముఖ్యమంత్రి సొంత జిల్లాలో మంచినీరు, పారిశుధ్యం లోపిస్తోందని, ఈ అంశాలపై ఎన్నికల ప్రచారంలో చర్చ జరగలేదని ఆమె వ్యాఖ్యానించారు. మున్సిపల్

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| పారం ధర లైవ్ బర్డ్ | 125 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 152 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 220 (కిలో) |
| స్కిన్ లెస్ | 251 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹72

# అమెరికాలో పట్టుబడ్డ ఎనిమిది మంది

## వ్యభిచారం, మానవ అక్రమరవాణ కేసు

అందులో వరంగల్‌కు చెందిన సుహృత్ రెడ్డి

అమెరికాలో జార్జియా రాష్ట్రంలో మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో తెలుగు వ్యక్తి చాడ సుహృత్ రెడ్డి కూడా ఉండటం గమనార్హం. అట్లాంటా శివారు ప్రాంతాలైన శాండీ స్ప్రింగ్స్, డన్వుడీ పోలీసులు సంయుక్తంగా అండర్ కవర్ ఆపరేషన్ ఆపరేషన్ నిర్వహించిన వీరిని పట్టుకున్నారు. 02



# మక్తల్ ఆరోవార్డు బిజెపి అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య

## ఎన్నికలకు ఒకరోజు ముందు అనూహ్య ఘటన

ఘటనకు కాంగ్రెస్ కారణమని మండిపడ్డ బిజెపి...

పార్లమెంటులో ప్రస్తావించిన కిషన్ రెడ్డి, లక్ష్మణ్

డిజిపి ఆఫీస్ ముట్టడికి బిజెపి శ్రేణుల యత్నంతో ఉద్రిక్తత

హైదరాబాద్, ఫిబ్రవరి 10 : ఎన్నికల ప్రచారం ప్రశాంతంగా ముగిసి..ఎన్నికలకు ఒకరోజు ముందు అనూహ్య ఘటన చోటుచేసుకుంది. నారాయణపేట జిల్లా మక్తల్ ఆరోవార్డు నుంచి పోటీ చేస్తున్న ఎరుకలి మహాదేవప్

-మిగతా 2 లో..




# రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ వెంటనే చెల్లించండి

వారికి బకాయిలు ఆపడం సరికాదు

సిఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 10 : రిటైర్డ్ ఉద్యోగులకు తక్షణమే బకాయిలు చెల్లించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన లేఖ

-మిగతా 2 లో..






# తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

మొదటి పేజీ తరువాయి



నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. వికసిత్ భారత్ అనే నినాదం ఇస్తూ దేశ అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, దక్షిణాది రాష్ట్రాల పట్ల ముఖ్యంగా తెలంగాణ విషయంలో స్పష్టమైన వివక్ష, నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోందని అన్నారు. 2018-19 నుంచి 2022-23 వరకు ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన మొత్తం పన్నులు రూ.90.80 లక్షల కోట్లు అయితే, ఇందులో దక్షిణాది రాష్ట్రాల నుండే పావుభాగానికి పైగా రూ. 22.86 లక్షల కోట్లు వచ్చాయన్నారు. అయినప్పటికీ, ఈ స్థాయిలో ఆదాయం ఇచ్చిన దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం తిరిగి ఇచ్చిన నిధులు మాత్రం కేవలం 16.3 శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. ఇది ఆర్థిక సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధం అని మంత్రి వ్యాఖ్యానించారు. పన్నులు చెల్లించిన ప్రతి రూపాయికి తిరిగి వచ్చే నిధులను పోల్చితే కేంద్రం పాటిస్తున్న ద్వంద్వ వైఖరి బయటపడుతుందని మంత్రి తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు రూపాయికి సగటున 30 పైసలు ఇస్తూ, ఇదే సమయంలో బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు రూ.1కి రూ.4 చొప్పున ఇస్తున్నారని, ఇది ఆర్థిక అసమతుల్యతను పెంచడమే కాకుండా, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలను సృష్టించే ప్రమాదకర ధోరణి అని హెచ్చరించారు. ఎక్కువ పన్నులు చెల్లించే రాష్ట్రాలను శిక్షించడం, తక్కువ వసూళ్లు చేసే రాష్ట్రాలను ప్రోత్సహించడం కేంద్ర విధానంగా మారిందని మంత్రి ఆరోపించారు. కేంద్రం చెప్పుకునే వికసిత్ భారత్ విధానం అంటే ఇదేనా అని మంత్రి ప్రశ్నించారు. డిసెంబర్ లో జరిగిన పార్లమెంట్ సమావేశాలలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2024-25 లో తెలంగాణ రాష్ట్రం నుండి 1,33,208 కోట్ల పన్నులు వసూలు అయితే.. కేంద్రం నుండి రాష్ట్రానికి కేంద్ర పన్నుల రూపంలో 27,050 కోట్లు, కేంద్ర గ్రాంట్ల రూపంలో 7,913 కోట్లు, కేంద్ర ప్రాయోజిక పథకాల రూపంలో 16,762 కోట్లు మొత్తంగా 51,725 కోట్లు విడుదల చేసినట్టు పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి సమాధానం చెప్పారని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. 'పథకాల రూపంలో వచ్చిన నిధులను కూడా కలిపితేనే ఈ మొత్తం వస్తోంది. స్వేచ్ఛగా వినియోగించుకునే నిధులు మాత్రం మరింత తక్కువ' అని మంత్రి వివరించారు. జీఎస్టీ సవరణల కారణంగా తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే ఏడాదికి సుమారు రూ.8 వేల కోట్లు నష్టపోతోందని మంత్రి తెలిపారు. ఇక 15వ ఆర్థిక సంఘం సూచించిన రెవెన్యూ లోటు గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం పూర్తిగా పక్కన పెట్టడంతో రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్యం÷-ర దెబ్బతిన్నదని విమర్శించారు. రంగాలవారీగా, రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకు కత్తెర పెట్టడం వల్ల తెలంగాణకు మరో రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.

ఇది కేవలం లెక్కల విషయం కాదు. ఇది కేంద్రంలో ఉన్న పాలకుల రాజకీయ ఆలోచనల ఫలితం. బలమైన రాష్ట్రాలను బలహీనపరచి, ఆర్థికంగా ఆధారపడేలా చేయాలనే ఉద్దేశమే కనిపిస్తోందని తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలలో బిజెపి పార్టీ అస్థిత్వాన్ని నిలబెట్టుకోవాలనే ఉద్దేశ్యంతోనే దక్షిణాది రాష్ట్రాలకు ముఖ్యంగా తాము అధికారంలో లేని రాష్ట్రాలకు తక్కువ నిధులు విడుదల చేసి, వారి కుంచిత స్వభావాన్ని చూపెడుతున్నారని అన్నారు. ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలు భాగస్వాములే కాని, కేంద్రం దయాధర్మాలపై ఆధారపడేవి కావని మంత్రిగారు స్పష్టం చేశారు. దేశ సమగ్ర అభివృద్ధి సాధించాలన్న, కేంద్రం చెప్పుకుంటున్న వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలన్నా, అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరగాలని, ముఖ్యంగా ఆదాయం సమకూర్చే రాష్ట్రాలపై వివక్ష మానుకోవాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని మంత్రి కోరారు. తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించే బిజెపి ఎంపీలు మరియు కేంద్ర మంత్రులు కూడా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పదేళ్లలో ఏనాడు ప్రశ్నించకపోగా, రాష్ట్రానికి అన్ని తెచ్చాం, ఇన్ని చేశాం, రాష్ట్ర ఖజానాకు కేంద్రమే పూర్తి నిధులు సమకూరుస్తుందనట్లు మాట్లాడటం వారి పతనానికి నాంది. జాతీయ రహదారుల నిర్మాణాలను కూడా రాష్ట్రానికి విడుదల చేసే నిధుల ఖాతాలలో వేస్తున్న ఈ నాయకులు, వాటిని నిర్మించి మళ్లీ ప్రజల నుండే టోల్ చార్జీల రూపంలో వసూలు చేస్తున్న విషయాన్ని మరిచారా అని మంత్రి ప్రశ్నించారు.

ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతు భరోసా, పంట కొనుగోళ్లు, సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో భారీగా ఖర్చు చేస్తోందని, కానీ కేంద్రం నుంచి రావాల్సిన న్యాయమైన వాటా రాకపోవడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అడ్డంకిగా మారుతోందని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ యూనియన్ బ్జడెట్ లో చేర్చాల్సిందిగా చేసిన ప్రతిపాదనలలో ఒక్కటి కూడా మంజూరు చేయలేదని, ఇప్పటికైనా తెలంగాణను రాజకీయంగా శిక్షించే బ్జడెట్‌లు ఇక మానుకోని, ఫెదరలిజాన్ని గౌరవించి, తెలంగాణకు న్యాయమైన వాటా ఇవ్వాలని, లేకపోతే వికసిత్ భారత్ ఒక నినాదంగానే మిగిలిపోతుందని, నిజమైన అభివృద్ధి సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. ఈ విషయంలో రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి నాయకులు కూడా తెలంగాణకు రావాల్సిన న్యాయబద్ధమైన వాటాకోసం కేంద్రంతో పోరాడటానికి మాతో కలిసి రావాలని మంత్రి కోరారు.

# తెలంగాణలో నేడు మున్సిపల్ ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

పంపిణీ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు మంగళవారం తరలించారు. ఎన్నికల సిబ్బంది ఇప్పటికే తమకు కేటాయించిన కేంద్రాలకు వాహనాల్లో వెళ్లారు. ఎన్నికలు జరిగే పురపాలికల్లో పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. అలాగే సమస్యాత్మక ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు. బ్యాలెట్ బాక్సులు, పత్రాలను పోలీస్ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి రాష్ట్రంలోని డిస్టిబ్యూషన్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు తరలించారు. అక్కడి నుంచి మంగళవారం ప్రతి పోలింగ్ కేంద్రానికి తరలించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అకడ సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ సౌకర్యం కల్పించారు. ఓటర్లు ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల గు ర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. 11న జరుగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని ఇప్పటికే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పోలింగ్ పక్రియ కోసం సిబ్బంది నియామకం, వారికి అందించిన శిక్షణపై సమీక్షించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డిజిపి కూడా పోలీస్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

## వాన్‌పిక్ ప్రాజెక్ట్‌కు సుప్రీంలో ఎదురుదెబ్బ

మొదటి పేజీ తరువాయి

పరిగణనలోకి తీసుకుందని.. దానికి గల కారణాలు చెప్పలేదంటూ వాన్‌పిక్ యాజమాన్యం తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేయడంతో వాన్‌పిక్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై జస్టిస్ సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పందిస్తూ.. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. దీనిపై విచారణకు నిరాకరిస్తూ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

## స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం

మొదటి పేజీ తరువాయి

ఉంది. వెంటనే పొరపాటును సరిచేసి రెండోసారి అవిశ్వాస తీర్మానం నోటీసును లోక్‌సభ సెక్రటరీకి విపక్షాలు అందజేశాయి. ఇండియా కూటమికి చెందిన 118 మంది ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేశారు. సభలో మాట్లాడేందుకు విపక్ష నేతలకు స్పీకర్ అవకాశం ఇవ్వడం లేదంటూ ఈ నోటీసు ఇచ్చారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, డీఎంకే పార్టీలు దీనికి మద్దతు పలుకగా, తృణవ-ూల్ కాంగ్రెస్ ఇంతవరకూ సంతకం చేయలేదు. ఈ పక్రియను సమీక్షించనున్నట్టు టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ తెలిపారు. అవిశ్వాస తీర్మానంపై రాహుల్ గాంధీ సంతకం చేయలేదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్పీకర్ తొలగింపు పిటిషన్‌పై ప్రతిపక్ష నేత సంతకం చేయడం సరైంది కాదని, రాహుల్ గాంధీ సంతకం చేయకపోవడానికి అదే కారణమని పేర్కొన్నాయి. కాగా, అవిశ్వాస తీర్మానం పరంగా లోక్‌సభలో బలాబలాలను చూసినప్పుడు లోక్‌సభలో అధికార పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. 293 మందితో మెజారిటీ సభ్యుల బలం వారికి ఉండగా, విపక్షాలకు 214 మంది సభ్యుల బలం ఉంది.

## ఎన్నికలకు ఒకరోజు ముందు అనూహ్య ఘటన

మొదటి పేజీ తరువాయి

ఆత్మహత్య సంచలనం కలిగించింది. ఇందుకు నిరసనగా బిజెపి భగ్గుమంది. ప్రత్యర్థుల వేధింపుల వల్లనే మహదేవప్ప ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించింది. సిఎం రేవంత్ రెడ్డి ప్రోద్బలంతో కాంగ్రెస్ కిడ్నాప్‌లకు, బెదరింపులకు పాల్పడిందని ఆరోపిస్తూ...నిరసనగా హైదరాబాద్ డీజీపీ కార్యాలయ ముట్టడికి బీజేపీ పిలుపునిచ్చింది. దీంతో లక్డీకపూల్ లోని డీజీపీ కార్యాలయం ముందు భారీగా పోలీసులు భారీగా మోహరించారు. ఇకపోతే లోక్‌సభలో కిషన్ రెడ్డి, రాజ్యసభలో డాక్టర్ లక్ష్మణ్ ఈ అంశాన్ని లేవనెత్తారు. సిఎం రేవంత్ రెడ్డి బెదరింపులకు పాల్పడుతున్నారని, ప్రత్యర్థులు భయంతో వణికేలా చేస్తున్నారని రాజ్యసభలో లక్ష్మణ్ ఆరోపించారు. రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని లోక్‌సభలో కిషన్ రెడ్డి ఆరోపించారు. ఇక హైదరాబాద్‌లో డిజిపి ఆఫీస్ ముందు బిజెపి ఆందోళనకు దిగింది. మహదేవప్ప మృతితో బిజెపి శ్రేణులు భారీగా తరలివచ్చి డీజీపీ ఆఫీసు దగ్గర ఉద్రిక్తత నెలకొంది. బీజేపీ డీజీపీ ఆఫీసు ముట్టడికి యత్నించింది. దీంతో లక్డీకపూల్ లోని డీజీపీ ఆఫీసు దగ్గరకు బీజేపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. డీజీపీ కార్యాలయంలోకి చొచ్చుకుని వెళ్లేందుకు యత్నించారు. బారికేడ్లు దూకేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. పలువురు బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని వాహనాల్లో తరలించారు. పలవురిని అరెస్ట్ చేశారు. ఃూష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరగనుండగా.. మక్తల్ మున్సిపాలిటీలో 6 వార్డ్ బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహాదేవప్ప ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.. మహదేవప్ప మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రత్యర్థుల వేధింపులతోనే మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నాడని అతడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఎన్నికలకు ఒక్క రోజు ముందే అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుపై దర్యాప్తు జరుగుతోందని డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు.

# అక్రమంగా కృష్ణా నీటిని తరలిస్తున్న ఆంధ్రా



హైదరాబాద్,ఫిబ్రవరి10 : ఇంతగా ఏపీ వినియోగిస్తుంటే ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి ఏం చేస్తున్నడని హరీష్ రావు ప్రశ్నించారు. 28 జనవరి నాడు తాత్కాలిక ఒప్పందం 66:34 ప్రకారం దాటి ఏపీ ఇప్పటికే 664 టీఎంసీలు వాడుకున్నదని హరీష్ రావు తెలిపారు. ఇంకా రెండు రోజుల్లో ఏపీ వినియోగం వాటా దాటుతుంది అని కేఆర్ఎంబీకి లేఖ రాసింది. వెంటనే బోర్డు మీటింగ్ పెట్టండి, ఏపీ నీటి దోపిడిని ఆపండి అని ఈఎన్‌సీ రాసిన లేఖలో ఉంది. 28న లేఖ రాసిండు, 31న ఈఎన్‌సీ రిటైర్ అయ్యారు. ఈఎన్‌సీ రిటైర్ అయిన తర్వాత వారం రోజుల దాకా పోస్టు నింపలేదు. లెక్కకు మించి నీళ్లు తీసుకుపోతుంటే మనకు ఈఎన్‌సీ పోస్టు నింపలేదు. వారం రోజుల తర్వాత మీడియా ప్రశ్నిస్తే పోస్టు నింపింది. బోర్డు మెంబర్ ఆయన. ఖాళీ పోస్టు ఎందుకు పెట్టారు. వాటా కుదరలేదా..? మాట కుదరలేదా..? వారం రోజులు ఎందుకు ఖాళీగా ఉంచారు.. రాష్ట్ర ప్రయోజనాలు ఈ ప్రభుత్వానికి పట్టదా.. ? అని హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్‌కు గురువు గారు ఉన్నరని భయం. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి నీళ్లు తరలించుకుపోతుంటే ఈ ప్రభుత్వం కండ్లు మూసుకు ప్రవర్తిస్తున్నదని మండిపడ్డారు. వేసవి వస్తున్నది, తెలంగాణకు నీటి అవసరాలు ఉన్నయి. పంటలకు, పారిశ్రామిక అవసరాలు ఉన్నాయన్నారు. తెలంగాణ అవసరాలు పట్టించుకునే బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా..? తాత్కాలికంగా అయినా మనం 34శాతం వినియోగించుకోవాలి కానీ వినియోగించుకున్నది 20 శాతం వాటా. మన రాష్ట్రానికి 174 టీఎంసీలు వాడుకునేది ఉన్నది. అయినా వినియోగించుకోరు. ఈ రోజుకు కూడా ఏపీ 1.5 టీఎంసీల నీళ్లు తీసుకుపోతున్నది. మన పంటలు ఏం కావాలె. మహబూబ్ నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటల పరిస్థితి ఏం కావాలి. సర్కారు నడుపుతున్నరా..? సర్కస్ నడుపుతున్నరా..? అని ధ్వజమెత్తారు. అడగాల్సిన రేవంత్ రెడ్డి అడగడు, హక్కులు కాపాడాల్సిన కేఆర్ఎంబీ ఏపీని ప్రశ్నించదు. బీజేపీ ప్రభుత్వం చేతిలో కేఆర్ఎంబీ ఉన్నది. రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేసీఆర్ మీద పడి ఏడ్వడం తప్పిదే..నీళ్ల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి ఎందుకు మాట్లాడరు..? కేఆర్ఎంబీని ఎందుకు నిలదీయరన్నారు. అడ్డగోలుగా ఏపీకి నీళ్లు తరలిస్తూ తెలంగాణ రైతుల నోళ్లు కొడుతున్నరు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఉన్న బంధం ఏమిటి..? రేవంత్, కిషన్ రెడ్డి కలిసి తెలంగాణ గొంతు పిసుకుతారా..? చంద్రబాబు, రేవంత్ మధ్య ఫెవికాల్ బంధం ఉండొచ్చు కానీ రాష్ట్ర హక్కులను ఆంధ్రాకు ఎందుకు రాసిస్తున్నరని ప్రశ్నించిన హరీష్ రావు. బీజేపీ, కాంగ్రెస్ ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే స్పందించి ఏపీ నీళ్ల తరలింపును అడ్డుకోవాలని, క్యారీ ఫార్వర్డ్ విధానంలో పైనున్న శ్రీశైలంలో నీటిని ఆపి పెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# వ్యభిచారం, మానవ అక్రమరవాణ కేసు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 : మానవ అక్రమ రవాణా, వ్యభిచార ముఠాలపై మానవ అక్రమ రవాణా లక్ష్యంగా జనవరి 29, 30వ తేదీల్లో ఆపరేషన్ శాండీ స్ప్రింగ్స్ గార్డియన్ పేరుతో అమెరికాలో పోలీసులు స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు. అట్లాంటాలోని పవర్స్ ఫెర్రీ రోడ్డు సమీపంలోని హోటళ్లలో ఈ సోదాలు నిర్వహించారు. అక్రమంగా లైంగిక కార్యకలాపాలకు పాల్పడటం, వ్యభిచారం కోసం సంప్రదించడం వంటి నేరాలు కింద 8 మందిని పట్టుకున్నారు. వీరిపై సొలిసిటేషన్ ఫర్ ఇల్లిసెట్ సెక్సువల్ యాక్ట్ కింద వీరిపై కేసులు నమోదు చేశారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. కాగా, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలుగువారు ఇలాంటి నేరాల్లో పట్టుబడటం ఇప్పుడు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అరెస్టయిన చాడ సుహృత్ రెడ్డిది తెలంగాణలోని వరంగల్‌గా తెలుస్తోంది. 2020లో కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన అతను ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాడు. 2022లో అమెరికాలోని అరిజోనా స్టేట్ ఆఫ్ యూనివర్సిటీలో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీపై ఎంఎస్ పూర్తి చేసినట్లు సమాచారం. వ్యభిచారం కింద అతనిపై కేసు నమోదైంది. ఈ కేసు రుజువైతే ఏడాది పాటు జైలుశిక్షతో పాటు రూ.90 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

# రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ ఆపడం సరికాదు

మొదటి పేజీ తరువాయి

రాశారు. 'సీఎం గారూ... మీకు మానవత్వం ఉందా?' అని ప్రశ్నించారు. విశ్రాంత ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించకుండా మానసిక వేదనకు గురి చేయడం న్యాయమా అని ప్రశ్నించారు. రిటైర్డ్ అయ్యి రెండేళ్లయినా.. వారి బకాయిలను ఇంకా చెల్లించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 61 మంది విశ్రాంత ఉద్యోగులు తనువు చాలించారని.. వారి చావులకు ఎవరు బాధ్యులని లేఖలో ప్రస్తావించారు. ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులను రాష్ట్ర సర్కార్ ప్రాధాన్యం లేని కేటగిరీలుగా భావిస్తోందా అని బండి సంజయ్ నిలదీశారు. ప్రభుత్వ తీరు తెలంగాణకు మాయని మచ్చ అని విమర్శించారు. జీవితం మలి సంధ్యలో ప్రశాంతమైన జీవితాన్ని గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వమే మానసిక వేదనకు గురిచేస్తుండటం క్షమించరానిదన్నారు. ముక్కూమొహం తెలియని వృద్ధులు కష్టాల్లో ఉంటేనే చేతనైనంత సాయం చేయాలని భావించే గొప్ప మానవతా హృదయం ఉన్న తెలంగాణ సమాజం మనదని ఆయన చెప్పుకొచ్చారు. ఉద్యోగ విరమణ చేసిన వెంటనే వారికి బెనిఫిట్స్ అన్నింటినీ చెల్లించి సగౌరవంగా సన్మానించి పంపాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని కేంద్ర మంత్ర్గి ÷ర్ అయ్యారు. దీనిని తక్షణమే అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుని వారి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు హైదరాబాద్ నడిబొడ్డున దీక్ష చేసేందుకు వెనకాడబోమని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## బెంగళూరు-చెన్నై హై స్పీడ్ రైల్ కారిడార్

# తిరుపతి మీదుగా వెళ్లేలా ప్లాన్ చేయండి


### కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు చంద్రబాబు వినతి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 :** బెంగళూరు-చెన్నై హై స్పీడ్ రైల్ కారిడార్‌ను తిరుపతికి కనెక్ట్ చేసేలా చూడాలని కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా అశ్వినీ వైష్ణవ్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. ఏపీని టచ్ చేస్తూ వెళ్లే మూడు హై స్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటించడంపై కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ రైల్వే ప్రాజెక్టుల పూర్తి, కొత్త రైలు మార్గాలు, సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యేలా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని సీఎం కోరారు. తాడిపత్రి నుంచి ముంబయి జేఎన్‌పీటీ పోర్టుకు అరటి ఎగుమతులకు వీలుగా 50 శాతం రాయితీపై ఖాళీ రీఫర్ కంటైనర్లు కేటాయించాలన్నారు. విజయవాడ, విశాఖ, తిరుపతి, అమరావతిలో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. ఉత్తర- దక్షిణ భారత్‌లను కలిపేలా ఇటార్సీ- విజయవాడ మధ్య ప్రత్యేక సరకు రవాణా కారిడార్ ఏర్పాటుకు సహకారం అందించాలన్నారు. ఏపీలోని పోర్టులను అనుసంధానిస్తూ విజయవాడ మీదుగా ఖరగ్ పూర్- చెన్నై మధ్య ఈస్ట్ కోస్ట్ కారిడార్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాయలసీమ సహా ఆదివాసీ ప్రాంతాలను కనెక్టు చేసేలా వివిధ కొత్త రైల్వేమార్గాల ప్రతిపాదనల్ని ఆమోదించాలని కోరారు. విశాఖ-విజయవాడ మధ్య హైస్పీడ్, విజయవాడ-కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్, తిరుపతి-చిత్తూరు మధ్య హైస్పీడ్ లింక్ కారిడార్ మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. హైదరాబాద్- శ్రీశైలం- మార్కాపురం కొత్త రైల్వే లైన్ ద్వారా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి కనెక్టివిటీని పెంచాలని, తిరుపతి మీదుగా విజయవాడ-బెంగుళూరు మధ్య వందేభారత్ సర్వీసును నడపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. వివిధ ఎక్స్ ప్రెస్ రైళ్లకు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వటంతో పాటు రైలు బోగీ నిర్వహణ టెర్మినల్ ఏర్పాటు చేయాలని రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు.

## హరీష్, రేవంత్ మధ్య ఉన్న బంధం ఏమిటో?

మొదటి పేజీ తరువాయి



ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు. కేవలం సిద్ధిపేట మున్సిపాలిటీకి మాత్రమే నిధులు మంజూరు అయ్యాయని.. హరీష్ రావు, ముఖ్యమంత్రికి మధ్య ఏముందో అర్థం చేసుకోవాలని కవిత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంపద సృష్టించకుండా.. ఆస్తులను అమ్మేతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 50 శాతం మంది రైతులకు ఇంకా రుణమాఫీ చేయలేదని వెల్లడించారు. రుణమాఫీపై చర్చకు తాము సిద్ధమని.. సచివాలయాలనికి రమ్మంటారా.. ముఖ్యమంత్రి సొంత జిల్లాకు రమ్మంటారా అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా నిజాలు చెప్పాలన్నారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు జాగృతి తరపున వినతి పత్రం అందిస్తామని కవిత తెలిపారు. లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా 12వ తేదీన బంద్‌కు జాగృతి మద్దతు ఇస్తోందని వెల్లడించారు. ఈ క్రమంలోనే ఎంఐఎం పార్టీ పొద్దు తిరుగుడు పువ్వులా.. ఎవరు అధికారంలో ఉంటే వారి వెంట ఉంటుందని సెటైర్లు వేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాయల తెలంగాణకు ఒవైసీ బ్రదర్స్ మద్దతు ఇచ్చారని, రేవంత్ రెడ్డి ఆర్‌ఎస్‌ఎస్ మనిషి అన్న ఒవైసీ.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సపోర్ట్ చేశారని కవిత విమర్శించారు.



## స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం

**అవిశ్వాస తీర్మానంపై చర్చలో విధులకు దూరం**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 :** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ పూర్తయ్యేంత వరకూ సభకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్‌ను తొలగించాలంటూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సెక్రటరీకి కాంగ్రెస్ నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో రాహుల్ గాంధీకి స్పీకర్ అవకాశం ఇవ్వలేదని, నిలదీసిన 8 మంది ఎంపీలపై సస్పెన్స్ వేటువేశారని విపక్షాలు తప్పుపడుతున్నాయి. విపక్షానికి చెందిన మహిళా ఎంపీలు దాడికి ప్రయత్నిస్తారనే సమాచారంతో ప్రధాని ప్రసంగం లేదని సభాపతి స్థానం నుంచి ఓం బిర్లా ప్రకటించడం, మహిళా ఎంపీలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన బీజేపీ ఎంపీపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ క్రమంలో 118 మంది సభ్యుల సంతకాలతో మంగళవారం ఉదయం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు విపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశాయి. కాగా, దీనికిముందు అధికార పార్టీకి తలొగ్గి తమపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ ఓం బిర్లాకు రాసిన లేఖలో కాంగ్రెస్ మహిళా ఎంపీలు నిరసన తెలిపారు.

## నేటి నుంచి ఆర్‌ఆర్‌బి పరీక్షలు

**విజయవాడ, ఫిబ్రవరి 10 :** దేశ వ్యాప్తంగా ఉన్న రైల్వే రీజియన్లలో ఆర్‌ఆర్‌బీ సెక్షన్ కంట్రోలర్ పరీక్ష బుధవారం నుచి ప్రారంభంకానుంది. ఇందుకు సంబంధించి మాక్ టెస్టులను రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు తాజాగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు డైరెక్ట్ లింక్ ద్వారా ఉచిత మాక్ టెస్ట్‌లు రాయవచ్చు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఎలాంటి పాస్‌వర్డ్ లేకుండా ఈ ఉచిత మాక్ టెస్టును ఉపయోగించుకోవచ్చు. 11, 12 తేదీల్లో ఆన్‌లైన్ విధానంలో ఆర్‌ఆర్‌బీ సెక్షన్ కంట్రోలర్ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు అడ్మిట్ కార్డులను సైతం ఇప్పటికే బోర్డు వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. కాగా భారత ప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు దేశ వ్యాప్తంగా గల అన్ని రైల్వే జోన్లలో మొత్తం 368 పోస్టులతో సెక్షన్ కంట్రోలర్ పోస్టుల భర్తీకి ఈ నియామక ప్రక్రియ చేపట్టింది. డిగ్రీతో ఈ నియామకాలను భర్తీ చేయనుంది. రామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ 2026) పరీక్షకు సంబంధించి దరఖాస్తుల సవరణకు ఫిబ్రవరి 11 వరకు అవకాశం ఇచ్చింది. దరఖాస్తుల్లో తప్పుల సవరణకు రేపటితో గడువు ముగియనుంది. ఇక సీయూఈటీ యూజీ ప్రవేశ పరీక్ష మే 11 నుంచి 31 మధ్య ఆన్‌లైన్ విధానంలో దేశ వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో జరగనుంది. ఈ పరీక్ష ద్వారా కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యాసంస్థల్లో 2026-27 విద్యాసంవత్సరానికి పలు యూజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం 13 భాషల్లో 37 సబ్జెక్టులకు ఈ పరీక్ష జరనుంది.

## గోషామహల్‌లో భారీగా నగదు పట్టివేత

**అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురి అరెస్ట్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** గోషామహల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు భారీ మొత్తంలో నగదు పట్టుకున్నారు. సోమవారం సాయంత్రం గోషామహల్ గ్యాన్‌బాగ్ కాలనీలోని గోకుల్ గోల్డ్ ఎలక్ట్రిక్ ఐటమ్స్ షాప్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పదంగా సంచులతో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా వీరిని ఆపి పరిశీలించగా.. సంచుల్లో భారీగా డబ్బు ఉన్నట్లు బయటపడింది. తనిఖీలో మూడు సంచుల్లో భారీ మొత్తంలో నగదు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మొత్తం నగదు విలువ రూ.76,87,650గా నిర్ధారణైంది. నగదు తరలింపు తీరు అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. అనుమానితులను జ్యోతిరామ్, గణపతి రామ్, మహేందర్‌లుగా పోలీసులు గుర్తించారు. ముగ్గురినీ గోషామహల్ పోలీస్‌స్టేషన్ కు తరలించి నగదుపై విచారణ చేపట్టారు. విచారణ సమయంలో అనుమానితులు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో పాటు నగదుకు సంబంధించిన ఎలాంటి ధ్రువీకరణ పత్రాలను సమర్పించలేక పోయారు. దీంతో నగదును పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటనపై గోషామహల్ ఇన్‌స్పెక్టర్ స్పందిస్తూ.. స్వాధీనం చేసుకున్న నగదును ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. అక్రమ నగదు తరలింపులపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

## అమెరికా వాణిజ్య ఒప్పందం
# భారత్‌కు డబుల్ దెబ్బ

- మన వ్యవసాయాన్ని ముంచేయడం ఖాయం
- వస్త్ర పరిశ్రకు కూడా కోలుకోలేని నష్టం
- ఎక్స్ వేదికగా మల్లికార్జున ఖర్గే విమర్శలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 :** భారత్ అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ఈ ఒప్పందం భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని, రైతులు, పశువులు, వస్త్ర రంగాన్ని బలహీనపరుస్తుందని ఆయన ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని ఆయన ప్రజా సంబంధాల ద్రోహంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 9న విడుదలైన వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ ఫిబ్రవరి 6న భారత్- అమెరికా సంయుక్త ప్రకటనలో చేర్చని షరతులను వెల్లడించిందని ఖర్గే ఎత్తిచూపారు. రష్యా చమురు నిలిపివేయడానికి భారత్ నిబద్ధతను ప్రదర్శించడం వల్లే అదనంగా 25 శాతం సుంకాల్ని తొలగించినట్లు అమెరికా ప్రకటన పేర్కొంది. ఇది భారతదేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడమేనని ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ‑ూరత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కేంద్రాన్ని అడిగినప్పుడు రష్యా చమురును నిలిపివేస్తున్నట్లు తమకు చెప్పలేదని ఖర్గే అన్నారు. అయితే ఈ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగా ట్వీట్ ద్వారా ప్రకటించాడు. రష్యన్ ఫెడరేషన్ చమురు కొనుగోలును నిలిపివేయడానికి భారతదేశ నిబద్ధతను అదనపు 25 శాతం సుంకాన్ని తొలగించడానికి ఒక షరతుగా జాబితా చేసినట్లు వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్ స్పష్టంగా చెప్పింది. దీన్నిబట్టి చూస్తే భారతదేశ సార్వభౌమత్వాన్ని హరించడానికి మోడీ ప్రభుత్వం అంగీకరించింది ఎందుకు? అని ఆయన ప్రశ్నించారు. ఈ ఒప్పందం వల్ల భారతదేశ వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటుందని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. పప్పుధాన్యాలు, జన్యుపరంగా మార్పు చేసిన (జిఎం) ఫీడ్, ఎండిన డిస్టిలర్ల ధాన్యాలు (డిడిజిలు) అంటే మొక్కజొన్న, సోయాబీన్స్.. ఇక పశుగ్రాసం కోసం ఎర్రజొన్నలను కూడా అమెరికా నుంచి దిగుమతి చేసుకునేటట్టు సైలెంట్‌గా ఇందులో చేర్చారని ఖర్గే ఆరోపించారు. దీని ఫలితం రెండు కోట్ల రైతులు, పశువుల పెంపకందారులు నష్టోపోవచ్చని ఖర్గే హెచ్చరించారు. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా.. ఒక ప్రభుత్వం మన వ్యవసాయాన్ని విదేశీ వస్తువులకు తలుపులు పూర్తిగా తెరిచింది. ఈ ఒప్పందంలో అదనపు ఉత్పత్తులు అంటే.. అర్థం ఇదే. ఈ విషయం మనకు తెలుసు. ఫిబ్రవరి 9న కొత్తగా విడుదల చేసిన వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్‌లో 'పల్స్' అనే పదాన్ని సైలెంట్‌గా జోడించింది. అయితే ఫిబ్రవరి 6, 2026న జారీ చేసిన భారత్ ? అమెరికా సంయుక్త ప్రకటనలో ఇవి లేవు. మరోవైపు బంగ్లాదేశ్ అమెరికా పత్తి దిగుమతులకి సున్నా శాతమే పన్నులు విధించగా.. భారత్ 18 శాతం పన్నులు విధించడాన్ని ఖర్గే విమర్శించారు. 18 శాతం పన్నులు విధించడాన్న పెద్ద విజయంగా మోడీ ప్రభుత్వం చెప్పుకుంటోందని ఖర్గే ఆరోపించారు. అమెరికా భారత రైతుల కంటే బంగ్లాదేశ్‌ను ప్రోత్సహించి.. తన సొంత లాభాలను కాపాడుకుంది. తిరుపూర్, సూరత్‌వంటి వస్త్ర కేంద్రాలు 18 శాతం పన్నుల పరిధిలోకి రావడంతో భారతీయ వస్త్ర రంగానికి డబుల్ దెబ్బ తగిలింది. జాతీయ ప్రయోజనాలను, ఎగుమతి ఇంజిన్‌ను త్యాగం చేసే ప్రజా సంబంధాల ద్రోహమా అని ఖర్గే ఎక్స్ పోస్టులో ప్రభుత్వాన్ని విమర్శించారు.

# మహదేవప్ప మృతికి రేవంత్‌దే బాధ్యత

- ఎన్నికల సంఘం విచారణ జరపాలి
- రేవంత్ రెండేళ్లుగా ఏమీ చేయకుండా తనపై విమర్శలా
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 :** మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతికి సీఎం రేవంత్ బాధ్యత వహించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి కోరారు. అతను అర్థాంతరంగా ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడన్న దానిపై అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తలాతోకా లేకుండా రేవంత్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ రెండేళ్లుగా మాటలతో కాలయాపన చేశారని.. ఏం చేస్తారో చేతల్లో చూపించాలన్నారు. ఇచ్చిన మాటపై నిలబడే శక్తి లేకపోతే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకపోతే తన పేరును మార్చి పిలుస్తున్నారని ఫైర్ అయ్యారు. 'మీరు రేవంత్ ఖాన్ అని మార్చుకోండి.. మాకు అభ్యంతరం లేదు. కానీ.. మా తల్లి పెట్టిన పేరు మార్చడానికి మీరెవరు? మాపై వ్యక్తిగత విమర్శలు సరికాదు. మీకు దెయ్యాలు.. దేవతల్లా కనపడవచ్చు. మజ్లిస్‌తో మీరు కాపురం చేసినన్నాళ్లూ.. మేం నిప్పులు పోస్తాం' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో అన్ని స్థానాల్లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయలేదని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. తాను ఎవ్వరికీ దత్తపుత్రుడ్ని కాదని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మధ్య ఏవైనా విభేదాలుంటే వారే తేల్చుకోవాలని, తనను మధ్యలో లాగడం ఎందుకని ప్రశ్నించారు. తన గురించి తప్పుగా మాట్లాడటం సరికాదన్నారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేయకుండా కిషన్ రెడ్డి పేరు మారుస్తానని అంటున్నారని కేంద్ర మంత్రి మండిపడ్డారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేస్తే కేంద్ర ప్రభుత్వం అడ్డురాకుండా చూసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక గాంధీ.. ఒక్క రోజూ కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడలేదని విమర్శించారు. తామెప్పుడూ బీఆర్ఎస్‌తో కలవలేదని తేల్చిచెప్పారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పోటీ చేశాయని గుర్తుచేశారు. ఇప్పుడేమీ చేయలేక తనపై ఆడిపోసుకుంటున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదా? కిషన్ రెడ్డిదా.? అనేది తెలంగాణ సమాజం ఆలోచించాలన్నారు.

### పిఎంజిఎస్‌వై నిధుల మంజూరుకు
## కేంద్రానికి ప్రతిపాదనలు పంపండి

**సిఎస్ కె.రామకృష్ణా రావు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన నాలుగవ దశలో భాగంగా రాష్ట్రంలో రోడ్ కనెక్టివిటీ లేని 227 ఆవాసాల్లో 642 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నేడు డా. బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో పీ.ఎం.జి.ఎస్.వై 4 వ దశ పనుల మంజూరుకై పంపే ప్రతిపాదనలపై రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్ లతోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, పీ.ఎం.జి.ఎస్.వై లో భాగంగా ఇప్పటి వరకు మూడు దశలలో రాష్ట్రానికి మంజూరైన రహదారులు, వంతెనల నిర్మాణ పనులను పూర్తి చేశామని, ఈ పథకం నాలుగవ దశ క్రింద రాష్ట్రంలో పక్కా రహదారులు లేని 227 ఆవాసాలల్లో 642.23 కిలోమీటర్ల రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. అయితే, వీటిలో, 34 పనులకు గాను 148 కిలోమీటర్లకు అటవీ శాఖ అనుమతులు పొందాల్సి ఉందని, ఈ మార్గాల్లో బ్రిడ్జిల నిర్మాణ పనులకు సంబంధించి మరో వారం రోజుల్లో డీపీఆర్ లను పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ తెలిపారు.

## మంత్రి నిబంధనల ఉల్లంఘన

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు యథేచ్ఛగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారు. అధికారం అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. తాజాగా జగిత్యాల జిల్లా ధర్మపురిలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కాన్వాయ్‌తో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హల్‌చల్ చేశారు. దీంతో ఎన్నికల సంఘం మంత్రిపై కేసు నమోదు చేసింది. మరోవైపు ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా గద్వాలపట్టణంలో మంగళవారం ఉదయం నుంచి వార్డుల్లో పర్యటించారు. అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో మీటింగ్ లు నిర్వహించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం

**కాంగ్రెస్ చర్యలపై ఈసీకి బిఆర్ఎస్ నేతల ఫిర్యాదు**

**హైదరాబాద్, ఫిబ్రవరి10 :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేళ అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తుంగలో తొక్కుతోందని భారత రాష్ట్ర సమితి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కురువ విజయ్ కుమార్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినిని కలిసి, అధికార కాంగ్రెస్ పార్టీ అక్రమాలపై సమగ్ర వినతి పత్రాన్ని సమర్పించింది. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసి కాంగ్రెస్ నేతలు అడ్డదారులు తొక్కుతున్నారని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రచారం ముగిసినా.. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బొమ్మెర రామ్మూర్తి, సురివి యాదయ్య గౌడ్, పార్టీ లీగల్ సెల్ ప్రతినిధి సదానంద్ పాల్గొన్నారు. ఖమ్మం జిల్లాలో అధికార పార్టీకి చెందిన ఒక మంత్రి గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, ట్రెజరీ అధికారులు, నాయకులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేశారని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇది అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని వారు మండిపడ్డారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. వన్ టౌన్ మరియు రూరల్ సీఐలు కాంగ్రెస్ నా యకులు పంచుతున్న మద్యం, డబ్బుకు రక్షణ కల్పిస్తూ..ప్రచారం చేసుకుంటున్న బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అధికార పార్టీ నాయకులు పోలీసుల అండతో ప్రతిపక్ష పార్టీల ఓటర్లను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. స్వేచ్ఛాయుతమైన ఎన్నికలకు అవకాశం లేకుండా చేస్తున్నారని కమిషన్‌కు వివరించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి.



## వేములవాడ శివరాత్రి ఉత్సవాలకు సిఎంకు ఆహ్వానం

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి మహా శివరాత్రి జాతర మహోత్సవానికి ఆహ్వానించారు. మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు. కలసి ఆహ్వాన పత్రిక అందచేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు-2026' ఆహ్వానం అందజేసారు. ఈ రెండు ప్రాంతాల్లో శివరాత్రి ఉత్సవాలు విశేషంగా జరుగుతాయి. అందువల్ల వీటికి హాజరు కావాలని మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్ కోరారు.



## నేటికీ ఫోన్‌ట్యాపింగ్‌కు పాల్పడుతున్న బిఆర్ఎస్ : పొంగులేటి

**ఖమ్మం, ఫిబ్రవరి 10 :** భారత రాష్ట్ర సమితి నేతలు ఇంకా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారన్న అనుమానం వస్తోందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. ఖమ్మం జిల్లా ఎదులాపురం పురపాలక ఎన్నికలపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడిన విషయాలు బయటకు లీక్ కావడంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులతో మాట్లాడిన మాటలు ఎలా విన్నారో పూర్తి స్థాయిలో విచారణ చేయిస్తామని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దీనితోనే ట్యాపింగ్‌లో వారు ఆరితేరారని గుర్తించవచ్చని అన్నారు.


## ఓటమి భయంతోనే మహదేవప్పకు బెదిరింపులు

**కాంగ్రెస్ అరాచకాలకు పరాకష్ట : కేంద్ర మంత్రి బండి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** మున్సిపల్ ఎన్నికల వేళ నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి, గిరిజన బిడ్డ ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య చేసుకొవడం తీవ్ర కలకలంగా మారింది. మాఫియా రాజకీయాలు, అహంకార ధోరణి తట్టుకోలేకే మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆత్మహత్యపై బీజేపీ నేత, కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఇది అత్యంత బాధాకరమైన ఘటన అని, మహదేవప్ప కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మహదేవప్పది ఆత్మహత్య కాదు కాంగ్రెస్ చేసిన హత్య అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. 'ఓటమి భయంతోనే బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని రాళ్లతో కొట్టే పరిస్థితి రాబోతోంది. మా సహనాన్ని పిరికితనంగా భావిస్తారా?. ఎన్నికల తరువాత కాంగ్రెస్‌పై యుద్ధం చేయబోతున్నాం. బీఆర్ఎస్ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ కార్యకర్తలది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయి. బీజేపీ కార్యకర్తలారా.. ధైర్యంగా ఉండండి, నాయకత్వం మీకు అండగా ఉంది. మహదేవప్ప కుటుంబాన్ని పరామర్శించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు బయలుదేరారు. మహదేవప్ప ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలి. నిష్పాక్షికంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి' అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## కొండాపూర్‌లో జంగమోని కుంటకు మోక్షం

**హైడ్రా చర్యలతో స్థానికుల హర్షం**




**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** హైదరాబాద్ కొండాపూర్ ప్రాంతంలో ఉన్న జంగంకుంట ఆక్రమణలపై హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. సుమారు రూ.700 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడుతూ.. అక్రమ కబ్జాదారులపై కఠిన చర్యలు చేపట్టింది. శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం-మదీనగూడ మార్గంలో జంగమోనికుంటకు సంబంధించిన 4 ఎకరాల భూమిని కబ్జాదారులు ఆక్రమించారు. సర్వే నెంబర్ 134 పరిధిలో ఉన్న జంగమోనికుంటను పూర్తిగా మాయం చేస్తూ.. ఆక్రమణదారులు మట్టితో నింపి చదును చేసినట్లు అధికారులు గుర్తించారు. జంగమోనికుంట చెరువును నాశనం చేసి భూమిని ప్లాట్లుగా విభజించి అమ్మకానికి సిద్ధం చేసినట్లు హైడ్రా గుర్తించింది. ఈ అక్రమాలపై ఇప్పటికే రెవెన్యూ అధికారులు కబ్జాదారులపై కేసులు నమోదు చేశారు. హైడ్రా బృందం రెవెన్యూ అధికారులతో కలిసి జంగమోనికుంట వద్ద జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించి, భూమి స్థితిగతులను పూర్తిగా పరిశీలించింది. అక్రమ కబ్జాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీసుల సహకారంతో చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులను హైడ్రా సిబ్బంది ప్రారంభించింది. భవిష్యత్తులో మళ్లీ ఎలాంటి ఆక్రమణలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, జల వనరులను రక్షించడమే లక్ష్యంగా హైడ్రాపై ప్రజల నుంచి ప్రశంసలు అందుతున్నాయి.

# ఎన్నికలంటే.. డబ్బున్నోళ్ల దందా!



**ఎన్నికల్లో ప్రలోభాల పర్వంతో తెలంగాణ పల్లెల నుంచి పట్టణాల దాకా మత్తులో జోగుతున్నాయి. మొన్నటి కి మొన్న పంచాయితీ పోరు ముగిసింది. ఇప్పుడు పట్టణపోరు జరుగుతోంది. డబ్బున్న అభ్యర్థులదే హవా. డబ్బులు లేని అభ్యర్థులను ప్రజలు చూసీచూడనట్లుగా ఉంటున్నారు. అతను ఎందుకు ఖర్చు పెడుతున్నాడో అర్థం చేసుకోవడం లేదు. ఎందుకు ప్రలోభ పెడుతున్నాడో గ్రహించడం లేదు. ఇప్పుడు పెట్టిన డబ్బు రేపు ప్రతి చిన్న పనికీ ముక్కుపిండి వసూలు చేస్తాడని గుర్తించడం లేదు. ఎన్నికలు వచ్చాయంటే రాజకీయ నాయకులకన్నా ప్రజలకు ఎక్కువ సంతోషంగా ఉంది. పండగ చేసుకుంటున్నారు. ఇంట్లో వంటావార్పులు అంతంత మాత్రమే. రోజుకు ఎవరో ఒకరు రావడం సాయంత్రానికి దావత్ ఇవ్వడం పరిపాటిగా మారింది.**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో గత వారం రోజులుగా ఇదే తంతు సాగింది. చివరకు బుధవారం ఎన్నికలు ఉండగా సాయంత్రం కూడా దావత్‌లకు టైమ్ కేటాయించారు. తాగుడు అలవాటు ఉన్నవారికి తాగినంత...తిండి అలవాటున్న వారికి తిన్నంత అన్న లెక్కన సాగడం ప్రజాస్వామ్య పరిహాసాని కి ఎన్నికలు పరాకాష్టగా నిలుస్తున్నాయి. సోమవారం సాయంత్రం మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెర పడింది. ప్రలోభాలకు తెర లేచింది. మద్యం, మాంసంతో పాటు ఇతరత్రా కానుకల పంపిణీ ప్రారంభమైంది. పది రోజుల పాటు హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం సోమవారం సాయంత్రం ఐదు గంటలతో ముగిసింది. ఆ వెంటనే కొందరు అభ్యర్థులు ఓటర్లపై తాయిలాలు వెదజల్లడం ప్రారంభించారు. కొన్నిచోట్ల ఓ పార్టీ నేతలు ఇంటింటికీ చికెన్ పొట్లాలు పంపించారు. మరో అభ్యర్థి తన వార్డు పరిధిలోని ఓటర్లకు హారతి ప్లేటెం పంపిణీ చేసారు. నామినేషన్ల పర్వం ముగిసిన వెంటనే ప్రధాన పార్టీలు రంగంలోకి దిగాయి. దాదాపు పది రోజుల పాటు ప్రచారంతో హోరెత్తించాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. పట్టణాల్లో గెలుపే లక్ష్యంగా ప్రచారం చేశారు. వందల మందిని వెంటేసుకుని గల్లీగల్లీ చుట్టేశారు. పార్టీల నేతలు వార్డుల వారీగా బాధ్యతలు పంచుకుని ఇంటింటికీ తిరిగారు. ప్రచార పర్వం ముగియడంతో అన్ని పార్టీల నేతలు ప్రలోభాలకు తెర లేపారు. ఉదయమే పోలింగ్‌కు సమయం దగ్గర పడడంతో విచ్చలవిడిగా తాయిలాలు వెదజల్లాయి.

చికెన్ వద్దు అన్నవారికి అరకిలో మటన్‌ను పంపించారు. గత రెండ్రోజులుగా మద్యం సీసాలు, కూల్‌డ్రింక్‌లు సరఫరా చేశారు. వీటికి అదనంగా రాత్రిపూట డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు ప్రజలు చెవులు కొరుక్కున్నారు. ఒక్కో ఓటుకు రూ.1500 నుంచి రూ.3 వేలు ఇచ్చినట్లు సమాచారం. కొన్ని పట్టణాల్లో ఖరీదు కూడా పెంచారు. డివిజన్లు, వార్డుల్లో మద్యం ఏరులై పారుతుండగా, మరోపక్క డబ్బుల పంపకాలు జోరందుకున్నాయి. ఇక, ప్రత్యర్థి ఎంత పంచుతున్నాడు.. అని అంచనా వేస్తూ అంతకుమించి ఓటర్లను ఇవ్వటానికి ఎత్తులు వేయడంలో అభ్యర్థులు తలమునకల య్యారు. ఇలా యథేచ్ఛగా పంపకాలు జరుగుతున్నప్పటికీ అధికారుల దృష్టిలో మాత్రం పడలేదు. అయితే పరస్పరం ఆయా పార్టీల వారు మా÷-తరం ఆరోపణలు చేసుకున్నారు. ఫలానా పార్టీవారు డబ్బులు పంచుతున్నారంటూ నిందలు వేసారు. స్థానిక నేతల అండతో విచ్చలవిడిగా మద్యం, డబ్బులను పంపిణీ చేస్తుంటే, పోలీసులు వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇదంతా ఒక ఎత్తయితే...ప్రత్యర్థి పార్టీల్లో నాయకులకు డబ్బు, మద్యం ఎరగా వేసి ఎన్నికల్లో గెలుపుకోసం మార్గాలు తయారు చేసుకుంటున్నారు. కోవర్టులను ఏర్పాట్లు చేసుకుని వారి ఎత్తులను చిత్తు చేయడానికి అభ్యర్థులు డబ్బులు ఆశ చూపుతు న్నారని సమాచారం. ప్రత్యర్థి అభ్యర్థితో ఉండే ముఖ్యమైన నాయకులు పార్టీ మారకున్నా సమాచారం చేరవేసి వారి ఓటమికి కృషి చేసే వారికి రూ. 50000 నుంచి రూ.లక్ష వరకు ముట్ట చెబుతున్నారని ప్రచారం జరుగుతోంది.

ఓటర్లనే కాకుండా ప్రత్యర్థి పార్టీల నాయకులను కూడా ప్రలోభాలకు గురి చేసి పార్టీలు మారడానికి వ్యూహాలు రచిస్తున్నారని తెలిసింది. మొత్తంగా మునిసిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగించారు. వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గెలుపు టెన్షన్‌తో పాటు చైర్మన్ సీటు దక్కుతుందా అనే ఉత్కంఠలో ఉన్నారు. ప్రధాన పార్టీలు చైర్మన్ అభ్యర్థిని ప్రకటించకుండానే ఎన్నికల ప్రచారం లోకి దిగాయి. ఈ నేపథ్యంలో పురపాలికల్లో చైర్మన్ సీటుపై ఆశతో ఆశావహులు భారీగా ఖర్చు పెట్టారు. తన గెలుపుతో పాటు తన పార్టీకి చెందిన వార్డు సభ్యుల గెలుపుకు కూడా వారి భుజస్కంధాలపై వేసుకున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా ఆశావహులు అన్నితామై వ్యవహరించారు. అయితే ఇన్నీ చేసిన చివరికి పార్టీకి మెజార్టీ సీట్లు వస్తాయా..? తానే పార్టీ అభ్యర్థిని అవుతానా అనే టెన్షన్‌లో ఆశావ హులు ఉన్నారు. ఏదిఏమైనా ఎన్నికల ప్రచారం ముగిసింది. ఎత్తులు, పైఎత్తులు పూర్తయ్యాయి. ప్రజలు ఎవరిని ఆదరిస్తారాఓ చూడాలి. గత సర్పంచ్ ఎన్నికల్లో డబ్బులు తీసుకుని ఓటేయలేదని నిలదీసారు. తమ డబ్బులు వాపస్ ఇవ్వాల ని నడిబజారులు పసుపుబియ్యంతో తిరిగారు. ఈ ఎన్నికల్లో అలాంటి విచిత్రాలు ఇంకా ఎన్ని చూడాల్సి వస్తుందో. ఓటర్ల మనసు ఎలా ఉం టుందో వేచి చూడాలి.

# పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- 3 వేల అదనపు బలగాలతో ఎన్నికల బందోబస్తు
- పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్
- ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై సమగ్ర దర్యాప్తు
- డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి






**హైదరాబాద్, ఫిబ్రవరి10 :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందని చెప్పారు. ఇతర శాఖల నుంచి మూడు వేల అదనపు బలగాలను ఎన్నికల బందోబస్తు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్లు భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నేపథ్యంలో 1,183 లైసెన్స్‌డ్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాం. 4,318 మందిని బైండోవర్ చేశాం. 398 నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేశాం. 4 రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 55 చెక్‌పోస్టులు ఉన్నాయి. 181 ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిద్ధం చేశాం. ఇప్పటివరకు రూ.3.09 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి 142 కేసులు నమోదు చేశామని అన్నారు. మక్తల్‌లో భాజపా అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాం. మహాదేవప్ప ఆత్మహత్య లేఖ రాయలేదని తెలిసింది. అయితే విచారణలో వివరాలు తెలుస్తాయని అన్నారు. హైదరాబాద్ ఎఫ్ఎస్ఎల్ ప్రమాదం ఎలా జరిగిందనేది విచారణ చేస్తున్నాం. ఏసీబీ కేసు 2015లో ఉన్న ఆధారాలు కోర్టుకు ఇచ్చాం. ఫోన్ ట్యాపింగ్ కేసులో కూడా అన్నీ పరిశీలించి నివేదికలు ఇచ్చాం. సాంకేతిక నిపుణులతో డేటాను రిట్రీవ్ చేస్తున్నాం అని డీజీపీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ ప్రమాదంలో కీలకమైన కేసులకు సంబంధించిన ఆధారాలు కాలిపోయాయనే అనుమానాల నేపథ్యంలో, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి స్పందించారు. ప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం, కేసుల విచారణ ఏ దశలో ఉందనే విషయాలపై ఆయన స్పష్టతనిచ్చారు. ఈ అగ్నిప్రమాదంలో ఎఫ్ఎస్ఎల్ లోని సర్వర్ రూమ్‌లు పూర్తిగా కాలిపోయాయని డీజీపీ వెల్లడించారు. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే, ఈ సర్వర్లకు ఎటువంటి బ్యాకప్ వ్యవస్థ అందుబాటులో లేదు. 'సర్వర్ రూమ్ పూర్తిగా దగ్ధమైంది. డేటా బ్యాకప్ లేకపోవడం వల్ల కొంత సమాచారం కోల్పోయే ప్రమాదం ఉంది. అయితే, ప్రస్తుతం సాంకేతిక నిపుణుల బృందం రంగంలోకి దిగి, కాలిపోయిన సర్వర్ల నుండి డేటాను తిరిగి వెలికితీసే ప్రయత్నాలు చేస్తోందని ఆయన వివరించారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కొన్ని కీలక కేసుల ఆధారాలు మాయమయ్యాయనే ప్రచారాన్ని డీజీపీ కొట్టిపారేశారు. ముఖ్యంగా 2015 నాటి ఏసీబీ కేసుల ఓటుకు నోటు వంటివి గురించి ప్రస్తావిస్తూ, ఆ కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలను తాము 2021లోనే కోర్టుకు సమర్పించామని స్పష్టం చేశారు. అందువల్ల ఇప్పుడు జరిగిన ప్రమాదానికి, ఆనాటి కేసుల ఆధారాలకు ఎటువంటి సంబంధం లేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. అదేవిధంగా, రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై కూడా ఆయన స్పందించారు. ఈ కేసులో కావాల్సిన అన్ని అంశాలను ఇప్పటికే నిశితంగా పరిశీలించామని, దానికి సంబంధించిన నివేదికలను ఇప్పటికే సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేశామని తెలిపారు.



## మహాదేవప్ప మృతి బాధాకరం

### మంత్రి బెదిరింపులే కారణమన్న రామచంద్ర రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** మక్తల్‌లో భాజపా అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య ఘటన తీవ్రంగా కలచివేసిందని బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఇది అత్యంత భాధాకరమని.. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. మహాదేవప్ప ఆత్మహత్యకు కాంగ్రెస్ అహంకారపూరిత రాజకీయాలు, మాఫియా బెదిరింపులే కారణంగా తెలుస్తోందన్నారు. స్థానిక మంత్రి శ్రీహరి, ఆయన అనుచరుల వేధింపులు తట్టుకోలేకే భాజపా అభ్యర్థి బలవన్మరణానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. అధికార మత్తులో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోంది. అహంకారపూరిత రాజకీయ నాయకుడి వేధింపులకు నిండు ప్రాణం బలైంది. ఈ ఘటనకు కారణమైన మంత్రి శ్రీహరిని తక్షణమే అరెస్ట్ చేయాలి. ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగించాలి. ఈ ఘటనపై ప్రభుత్వం నిష్పక్షపాత విచారణ జరపాలి. లేనిపక్షంలో భాజపా కార్యకర్తల ఆగ్రహ జ్వాలలకు గురికాక తప్పదు. దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టకూడదు. మహాదేవప్ప కుటుంబానికి న్యాయం జరిగే వరకు భాజపా పోరాటం చేస్తుంది' అని రామచందర్‌రావు అన్నారు.

## ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో స్కూళ్లకు సెలవులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేలు స్కూళ్లలో చదివే విద్యార్థులకు వరుస సెలవులు వచ్చాయి. ఎందుకంటే ఈ వారంలో వరుసగా నాలుగు రోజుల పాటు స్కూల్‌లకు సెలవులు ఉండే అవకాశం ఉంది. ఈ సెలవులు రాష్ట్రవ్యాప్తంగా కాకుండా కేవలం కొన్ని జిల్లాలో మాత్రమే ఉండనున్నాయి. ఎందుకంటే రాష్ట్రంలో ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆరోజు ఎన్నికల ప్రక్రియలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు రాష్ట్రంలో ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో స్కూల్‌లకు సెలవులు ప్రకటించారు. దీంతో ఈసీ అధికారులు ఫిబ్రవరి 11న ఆయా ప్రాంతాల్లోని స్కూళ్లకు సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 11న పోలింగ్ ముగిసిన ఒక రోజు తర్వాత రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ అనేది పోలింగ్ జరిగిన ప్రాంతాల పరిధిలోని గవర్నమెంట్, ప్రైవేట్ స్కూల్‌లో నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో కౌంటింగ్ నిర్వహించే స్కూల్‌లకు ఆరోజు అధికారులు సెలవులు ప్రకటించను న్నారు. ఈ ప్రక్రియ ముగిసిన మరుసటి రోజు అంటే ఫిబ్రవరి 14న రెండో శనివారం, ఫిబ్రవరి 15న ఆదివారం ఎలాగో హాలీడే కావడంతో వరుసగా రెండ్రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్‌లకు సెలవులు ఉండనున్నాయి. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఈ వారంలో నాలుగు రోజులు పాటు సెలవులు దొరకనున్నాయి.

## మహాదేవప్ప ఆత్మహత్యపై విచారణ చేయాలి

- మాఫియా రాజకీయాలతోనే ఆత్మహత్య
- కుటుంబ సభ్యులకు బిజెపి నేతల పరామర్శ



**మక్తల్, ఫిబ్రవరి 10 :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేళ నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి, గిరిజన బిడ్డ ఎరుకల మహాదేవప్ప ఆత్మహత్య చేసుకొవడం తీవ్ర కలకలంగా మారింది. మాఫియా రాజకీయాలు, అహంకార ధోరణి తట్టుకోలేకే మహాదే వప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆత్మహత్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు స్పందించారు. మహ దేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తనను తీవ్రంగా కలచి వేసింద న్నారు. ఇది అత్యంత బాధాకరమైన ఘటన అని, మహాదేవప్ప కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపి డికె అరు-ణతో కలసి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయించాలన్నారు. ఆత్మహత్యకు వేధింపులే కారణమని అన్నారు. ఇదిలావుంటే మహాదేవప్పది ఆత్మహత్య కాదు కాంగ్రెస్ చేసిన హత్య అని ఎంపి డికె అరుణ మండిపడ్డారు. 'ఓటమి భయంతోనే బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని రాళ్లతో కొట్టే పరిస్థితి రాబోతోంది. మా సహనాన్ని పిరికితనంగా భావిస్తారా?. ఎన్నికల తరువాత కాంగ్రెస్‌పై యుద్ధం చేయబోతున్నాం. బీఆర్ఎస్ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ కార్యకర్తలదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయి. మహాదేవప్ప ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలి. నిష్పాక్షికంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.

## శైవాలయాల్లో పెరుగుతున్న రద్దీ

- శివరాత్రి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు
- మంత్రులు, అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశాలు

**అమరావతి, ఫిబ్రవరి 10 :** శ్రీశైలం సహా వివిధ శివాలయాల్లో శివరాత్రి భక్తుల రద్దీ, వసతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ, సౌకర్యాలపై మంత్రులు, ప్రధాన కార్యదర్శి, డీజీపీలతో పాటు ఇతర అధికారులతో ఢిల్లీ నుంచి సీఎం సమీక్షించారు. శివరాత్రి నాటికి ఆలయంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, హోం మంత్రి అనిత.. ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు, వసతులపై అధికారులతో పర్యవేక్షించాలని సీఎం సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అలాగే, దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు త్వరితగతిన దర్శనం పూర్తయ్యేలా.. సరైన వసతి లభించేలా కార్యచరణ అమలు చేయాలని ఆదేశించారు. దీక్షలు, మాలధారణలతో ఎంతో కష్టపడి ఆలయానికి చేరుకునే భక్తులకు ఇబ్బంది కలిగేలా, అగౌరవ పరిచేలా ఎవరూ వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. ÷రిలిజు రోజుకూ దేవాలయాల్లో పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు సూచించారు. శివరాత్రి పర్వదినం వంటి సందర్భాల్లో అన్ని విభాగాలు పూర్తి సమన్వయంతో పనిచేసేలా ఇప్పటి నుంచే పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

## తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం

### సిట్ విచారణతో రంగంలోకి దిగిన ఈడీ

**తిరుమల, ఫిబ్రవరి 10 :** శ్రీవారి లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీ ఆర్థిక అక్రమాలు, మనీ లాండరింగ్ జరిగినట్లు సిట్ విచారణలో తేలడంతో పీఎంఎల్ చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో వందలాది కోట్లు చేతులు మారడంపై ఈడీ విచారణ జరపనుంది. అలాగే, మనీ ట్రయల్‌పైనా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దృష్టిసారిం చనున్నారు. కాగా, 2019 నుంచి 2024 వరకు టీటీడీకి సుమారు 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు సీబీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో తేల్చింది. ఈ నెయ్యి విలువ సుమారు రూ. 235 కోట్లుగా అంచనా. నెయ్యి కల్తీ వ్యవహారంలో విచారణ ముగించిన సిట్.. ఛార్జ్‌షీట్‌లో 36 మందిని నిందితులుగా చేర్చింది. వారిలో 12 మంది టీటీడీ ఉద్యోగులు ఉన్నారు. టెండర్లలో అక్రమాలు, హవాలా మార్గాల ద్వారా లంచాలు, అక్రమ లావాదేవీలు జరిగినట్లు విచారణలో బయటపడింది. ఈ క్రమంలో ఆర్థిక అక్రమాలు, నిధుల మళ్లింపుపై ఈడీ విచారణ చేపట్టనుంది. ఈ కేసుతో సంబంధం ఉన్న వారికి ఈడీ.. త్వరలోనే నోటీసులు జారీ చేసి విచారించనున్నట్లు సమాచారం.

## బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు

### యువత తీరుపై సజ్జన్నార్ హెచ్చరికలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న యువతకు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. నగరంలో యువకులు బైక్‌పై చేస్తున్న ప్రమాదకర విన్యాసాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో సీపీ సజ్జన్నార్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. వాహనాలను బాధ్యతాయ-ుతంగా నడపాలని సూచించారు. బైక్ మీద చేసే ఈ చిత్రవిచిత్రమైన విన్యాసాలు చూడటానికి థ్రిల్లింగ్‌గా అనిపించవచ్చని.. కానీ అవి క్షణాల్లో ప్రాణాలకు ముప్పు తెచ్చిపెడతాయని ఆయన హెచ్చరించారు. బైక్ మీద చేసే విన్యాసం.. నూరేళ్ల ఆయుష్షుకు వినాశనం అంటూ ఆయన పేర్కొన్నారు. చిన్న ప్రమాదం జరిగినా జీవితాంతం మంచానపడాల్సి వస్తుందని సీపీ అన్నారు. అంతేకాకుండా, మీ వల్ల ఇతరులు కూడా ప్రమాదాలబారిన పడొచ్చని తెలిపారు. సోషల్ మీడియాలో లైకులు, వ్యూస్ కోసం.. రోడ్డు మీద హీరోయిజం చూపించాలనే ఆశతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సజ్జనార్ సూచించారు. బైక్‌పై స్టంట్లు చేస్తూ వెనుక కూర్చున్న వ్యక్తుల ప్రాణాలను కూడా రిస్క్‌లో పెడుతున్న ఈ చర్యలు చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి వాటి వల్ల కేసుల పాలై సమస్యలను కొని తెచ్చుకోవద్దని హెచ్చరించారు. 'బాధ్యతగా డ్రైవ్ చేయండి' అంటూ సీపీ సజ్జనార్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## మారుతీ కార్ల సర్వీస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** హైదరాబాద్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రముఖ కార్ల కంపెనీ సర్వీస్ సెంటర్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పలు కార్లు దగ్ధమయ్యాయి. రాజేంద్రనగర్ మారుతీ సుజుకీ సర్వీస్ సెంటర్‌లో ఈ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. భారీ అగ్ని ప్రమాదం కారణంగా పరిసరాల్లో దట్టమైన పొగ అలుముకుంది. ప్రమాదంలో పలు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను ఆర్పేశారు. ఈ అగ్ని ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని, మంటలను ఆర్పేశారు. ప్రమాదంలో ఆ ఎ÷-లోర్‌లోని కంప్యూటర్లు, ఫోరెన్సిక్ సంబంధిత కెమికల్స్‌తో సహా కీలకమైన పత్రాలు కాలి బూడిదయ్యాయి.



## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

**ఆత్మకూరు( ఎం). రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు( ఎం ).మండల కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గ్రామ ప్రజల కళ అయినా డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు కేటాయించి పనులను వేగవంతంగా చేయిస్తున్న ఆలేరు అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.మొదటి విడతగా 1.కోటి 70లక్షలు,రెండో విడత 80 లక్షల (హై స్కూల్ వరకు సిసి రోడ్ నిర్మాణానికి ) నిధులు కేటాయించడం జరిగింది. అట్టి రోడ్డు నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. మంగళవారం సిసి రోడ్ నిర్మాణ పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులు పరిశీలించి ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్. పట్టణ కాంగ్రెస్ పార్టీ పోతగాని మల్లేశం గౌడ్.,వార్డు సభ్యులు బూడిద శేఖర్ కాంగ్రెస్ నాయకులు జన్నాయికోడె యుగంధర్, గుండెగాని ఐలయ్య దొంతరబోయిన భాస్కర్,,రంగస్వామి, నోముల యాదగిరి, రంగా శ్రీను, ఎలగందుల శ్రీనివాస్,తవిటి రాజు, కోరే మల్లేష్, మోలుగురీ సత్యనారాయణ తొండల అనిల్, యాస సుభాష్, గుండెగాని కిరణ్, లోడి మహేష్, యాస వెంకట్ రెడ్డి, కట్టే కోలా సి మ్మయ్య బాసా ని శంకర్, పవన్ పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పనులను ప్రారంభించిన గొల్లపల్లి సర్పంచ్ కిషన్ యాదవ్

**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలంలో గల గొల్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు సర్పంచ్ కిషన్ యాదవ్ ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో ఏపీవో ధర్మ రెడ్డి, ఉపసర్పంచ్ మధు, వార్డ్ నెంబర్ మంజుల, ప్రభాకర్ రెడ్డి, మల్లేష్ , సెక్రెటరీ జనార్ధన్, పాలకవర్గం, మేట్ నవీన్, ఉపాధి హామీ కూలీలు రాజమ్మ తండా అడవి ప్రాంతంలో పనులు ప్రారంభించారు.




## పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత

**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్ :** ముల్కనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ను చింతగట్టు గ్రామానికి చెందిన ప్రసన్న కుమారికి మంగళవారం నాడు ఎస్సై రాజు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరైనా తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న, దొంగిలించబడిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. సంబంధిత వివరాలు పోలీస్ స్టేషన్లో నమోదు అవుతాయని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ కొనుగోలు చేసిన సమయంలో తప్పనిసరిగా సంబంధిత బిల్లులు, ఐఎంఈఐ నెంబర్లు భద్రపరచుకోవాలన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఇతర ఆర్థిక నేరాలు పెరిగిపోతున్నందున మొబైల్ ఫోన్లో పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



## ఘనంగా శ్రీ కాలభైరవ స్వామికి సింధూర పూజలు

**రామారెడ్డి (రాజముద్ర,) న్యూస్ :** రామారెడ్డి మండలం ఈసనపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామికి మంగళవారం రోజున ఘనంగా సింధూర పూజలు నిర్వహించారు, ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు పూజారులు నిర్వహించారు, అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రామచంద్రం, ఆలయ చైర్మన్ చింతల శంకర్, డైరెక్టర్లు, అసిస్టెంట్ ఈవో లక్ష్మణ్, పంతులు శ్రీనివాస్ శర్మ, వంశీ శర్మ , భక్తులు పాల్గొన్నారు.





# సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

### రాష్ట్ర సమాచార కమిషనర్ పి.వి శ్రీనివాసరావు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టం–2005 పై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర సమాచార కమిషనర్ పి.వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన సమాచార హక్కు చట్టం–2005 అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ... ప్రజల హక్కుల పరిరక్షణకు, ప్రజాస్వామ్య బలానికి ఆధారమైన సమాచార హక్కు చట్టం – 2005 అమలును గురించి విద్యార్థులలో అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు తన హక్కుల గురించి అవగాహన పెంచుకోవడం, ప్రజా వ్యవస్థలో పారదర్శకతను, జవాబుదారితనాన్ని పెంపొందించడం సమాజ అభివృద్ధికి అవసరమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో, సమాచార హక్కు చట్టం ఒక వజ్రాయుధం అన్నారు. ప్రతి ఒక్కరూ ఒక్కో అంశంపై దృష్టి పెట్టి, తమ పరిధిలోని ప్రజా సమస్యలపై సమాచారా న్ని అడగడం ద్వారా బాధ్యతాయుత పౌరుడిగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి, నెలకొండపల్లి తహసిల్దార్ ఆర్. వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారి బి చలపతిరావు, మండల పరిషత్ అధికారి పి. శివ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. వెంకటేశ్వర రెడ్డి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు,సీనియర్ పాత్రికేయులు చిర్ర రవి, మాజీ టీఎన్జీవో అధ్యక్షులు రంగరాజు, ఉస్మానియా విశ్వవిద్యా లయం పరిశోధకులు డాక్టర్ వీరబాబు, పాత్రికేయులు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ నిధులు 12 వేలకోట్లు విడుదల చేయాలి

### ఎమ్మార్పీఎస్ రామన్నపేట మండల అధ్యక్షులు గోర్ల నరసింహ



**రామన్నపేట. రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా. రామన్నపేట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న ఆదేశ అనుసారం . ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశం. గొర్ల నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరేళ్ల రమేష్ మాదిగ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల శ్రీనివాస్ మాదిగ హాజరై మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ కు. 12 000 వేల కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు దళిత నిరుద్యోగులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వాలు ఎస్సీ సంప్లా నిధులను ఎస్సీల అభివృద్ధికి కేటాయించకుండా కాళేశ్వరం మిషన్ భగీరథ మిషన్ . పనులకు నిధులు మళ్ళించి సబ్ ప్లాన్ . దుర్వినియోగం చేసి మాదిగ మాదిగ ఉపకులాలకు అన్యాయం చేసినారు ఇప్పటికైనా ప్రభుత్వాలు గుర్తు ఎరిగి మాదిగ ఎస్సీ కార్పొరేషన్ నిధులను వెంటనే కేటాయించి దళిత నిరుద్యోగులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అలాగే రాబోయే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో విద్యకు 35 శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ పాఠశాలను . మూసి వేయకుండా ఆదుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు మేకల సంపత్ కొండగడప శంకరయ్య గట్టు లింగయ్య మేడి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు

## ఓంబిర్లాపై అవిశ్వాసం విచారకరం

### కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

**విజయవాడ, ఫిబ్రవరి 10 :** లోక్‌సభ స్పీకర్ అంటే ఒక జడ్జి లా ఉండాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. అన్ని పక్షాలను కలుపుకుని ముందుకు వెళ్లే వారు స్పీకర్.. అని, అయితే ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం రావడం విచారకరం అన్నారు. సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దౌర్భాగ్యం.. నిన్న బెయిల్ కోసం వెళ్ళిన రాజ్ కేసిరెడ్డి ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర విభజన జరిగాక రాష్ట్ర దుస్థితిని సూచిస్తుందని పేర్కొన్నారు. అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా.. చంద్రబాబు తల్లిని ఉద్దేశించి తిట్టడం జగన్ ఖండించకపోయిన, నేను తీవ్రంగా ఖండిస్తున్నాన ని తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది.. ఫుల్ మెస్ ఛార్జీలు, స్కాలర్షిప్ లు, ఫీజు రీయింబర్స్మెంట్ లు రాక ఇబ్బందులు పడుతున్నారు అని చింత మోహన్ వెల్లడించారు. అయితే, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమ్మ ఒడి పేరుతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు అందించిన సౌకర్యాలను ఈ ప్రభుత్వం నిలిపేసిందని మాజీ కేంద్రమంత్రి చింత మోహన్ పేర్కొన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే విధానాలు అవలంభిస్తుంది.

## పుట్టినరోజు సందర్భంగా సొంత గ్రామానికి ఉచిత ఆటో సేవా

### పదవులు కాదు, ప్రజా సేవే ముఖ్యం అంటున్న గోపాల్ రెడ్డి



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** సేవాభావమే తన జీవిత లక్ష్యంగా ముందుకు సాగుతున్న పులకండ్ల గోపాల్ రెడ్డి శివస్వామి. తన పుట్టినరోజు సందర్భంగా సొంత గ్రామమైన పోద్దటూర్ గ్రామ ప్రజలకు ఒక అమూల్యమైన బహుమతిని అందించారు. గ్రామం నుంచి హైదరాబాద్ మెయిన్ రోడ్డు వరకు గ్రామ ప్రజలకు నిత్యావసరంగా ఉపయోగపడేలా ఉచిత ఆటో సేవను గ్రామానికి అంకితం చేస్తూ మరో సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గత డిసెంబర్ నెలలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో వార్డు మెంబర్‌గా ఓటమి ఓడిపోయినప్పటికీ, ఏ మాత్రం కుంగిపోకుండా ప్రజల పట్ల తన బాధ్యతను మరింత బలంగా చాటుతూ....ఈ ఆటో సేవను ప్రారంభించడం గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఓటమి రాజకీయ ప్రయాణాన్ని ఆపలేదని, ప్రజాసేవే తన అసలైన లక్ష్యమని గోపాల్ రెడ్డి శివస్వామి మరోసారి నిరూపించారు. ఈ ఉచిత ఆటో సేవ ద్వారా విద్యార్థులు, వృద్ధులు, మహిళలు, రోజువారీ ప్రయాణికులు నేరుగా లబ్ధి పొందనున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొనే రవాణా ఇబ్బందులు తగ్గడమే కాకుండా, అవసరాల కోసం పట్టణాలకు వెళ్లే వారికి ఈ ఆటో సేవ ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి శివస్వామి మాట్లాడుతూ.. "పదవులు శాశ్వతం కావని, కానీ ప్రజల ప్రేమ, ఆశీర్వాదాలు శాశ్వతం అన్నారు. తాను గెలిచినా, ఓడినా పోద్దటూర్ ప్రజల మధ్యే ఉంటానని, గ్రామ అభివృద్ధే తన ధ్యేయమన్నారు. ఈ ఉచిత ఆటో సేవ గ్రామ ప్రజలకు కొంతైనా ఉపయోగపడితే అదే నా పుట్టిన రోజు ఆనందం" అని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బండ లక్ష్మి నర్సింహా, ఉపసర్పంచ్ కవేలి గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఏనుగు నర్సింహా రెడ్డి, ఎంపీటీసీల ఫోరమ్ మాజీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బండ నర్సింహా, మాజీ వార్డు సభ్యులు కవేలి రాంరెడ్డి, నట్టల రమేష్, నాని మల్లేష్, ల్యాగల హన్మంత్, నక్క వెంకటేష్, ఏనుగు సంజీవరెడ్డి, బొల్లారం వెంకట్ రెడ్డి, పులకండ్ల రఘుపతి రెడ్డి, బొల్లారం మోహన్ రెడ్డి, పట్నం మోహన్ రెడ్డి, మేకల గోపాల్ రెడ్డి,వినోద్ కుమార్, మేకల రఘుపతి రెడ్డి, కవేలి రమణారెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు జంగారెడ్డి,ఎనికెపల్లి మాణిక్యం, లస్కర్ మ ల్లారెడ్డి, కోలన్ మల్లారెడ్డి, పులకండ్ల లింగారెడ్డి, నాని రత్నం, బూడుద్దుల నవీన్ కుమార్, పట్నం రాజిరెడ్డి,గద్య మహేందర్, బొల్లారం జంగారెడ్డి, చాకలి వెంకటేష్, సురకంటే మల్లా రెడ్డి, మల్కాపురం యాదయ్య, మల్లేష్, స్వామి, మల్లయ్య స్వామి, మహేందర్ రెడ్డి, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పనులు ప్రారంభం

- ఉపాధి హామీ పథకం గ్రామీణ పేద కూలీలకు ఆర్థిక భరోసా
- వంగర గ్రామ సర్పంచ్ సృజన రమేష్

**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్:** భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గజ్జల సృజన రమేష్ మాట్లాడుతూ.., ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలు, కూలీలకు ఆర్థిక భరోసా కల్పించే ముఖ్యమైన పథకమని తెలిపారు. గ్రామంలోని ప్రతి అర్హుడైన ఉపాధి కూలీకి పని దొరికేలా చర్యలు తీసుకుంటామని, వంద రోజుల ఉపాధి లక్ష్యాన్ని చేరుకునేలా గ్రామపంచాయతీ కృషి చేస్తుందని అన్నారు. గ్రామ అభివృద్ధితో పాటు కూలీల జీవనోపాధి మెరుగుపడాలనే ఉద్దేశంతో ఈ పనులు ప్రారంభించామని, పనుల అమలులో పారదర్శకత, నాణ్యత, వేగానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లాల రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రజిత, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



## కార్మిక హక్కుల పరిరక్షణకు 12న సమ్మె

- కూకట్‌పల్లిలో సిఐటియు కరపత్రాలతో ప్రచారం
- స్వచ్ఛందంగా కదిలి రావాలని పిలుపు

**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న జరగనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ మంగళవారం కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని మూసాపేట్, వై జంక్షన్, ప్రశాంతి నగర్ ప్రాంతాల్లో సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యదర్శి సబియా మాట్లాడుతూ, నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికుల హక్కులను హరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. ఈ కోడ్‌లు అమల్లోకి వస్తే ఉద్యోగ భద్రత పూర్తిగా నశించి, పని గంటలు పెరిగి, జీతాలు తగ్గే ప్రమాదం ఉందన్నారు. కార్మిక సంఘాల హక్కులు, సమ్మె చేసే స్వేచ్ఛను కూడా ఈ చట్టాల ద్వారా కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేకంగా ఆశా, అంగన్‌వాడీ, మిడ్‌డే మిల్ వర్కర్లు వంటి స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించకుండా ప్రభుత్వం వివక్ష చూపుతోందని, కనీస వేతనం, సామాజిక భద్రత, పెన్షన్ వంటి హక్కులు కూడా ఇవ్వకుండా దోపిడీ చేస్తోందన్నారు. కార్మికుల ఐక్యతతోనే ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు గట్టి సమాధానం ఇవ్వగలమని పేర్కొన్నారు. ఈ సమ్మెలో ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తమ నిరసన వ్యక్తం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఆశా వర్కర్లు మౌనిక, రాణి, లలిత, అనురాధ, సోమలత తదితరులు పాల్గొన్నారు.



## స్టార్మర్ నెత్తిన 'ఎప్‌స్టీన్' పిడుగు..

### యూకే ప్రధాని రేసులో షబానా

**యూకే :** ఎప్‌స్టీన్ ఫైళ్ల వివాదం బ్రిటన్‌లో మరోసారి రాజకీయ సంక్షోభానికి దారితీసింది. ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా చేస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఒకవేళ స్టార్మర్ వైదొలిగితే యూకే తదుపరి ప్రధాని (ఖఖ్రావీ)గా ఎవరు ఎన్నికవుతారనే దానిపై చర్చ మొదలైంది. ఈ రేసులో మహిళా ఎంపీ షబానా మహ్మద్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. అదే జరిగితే బ్రిటన్ చరిత్రలోనే పాక్ మూలాలు ఉన్న తొలి ముస్లిం ప్రధానిగా షబానా నిలవనున్నారు. షబానా మహ్మద్ ప్రస్తుతం స్టార్మర్ ప్రభుత్వంలో హోం మంత్రిగా కొనసాగుతున్నారు. 45 ఏళ్ల షబానా 2010 నుంచి బర్మింగ్‌హామ్ లేడీవుడ్ స్థానానికి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వృత్తిరీత్యా బారిస్టర్ అయిన ఆమె.. ఆ తర్వాత రాజకీయాల వైపు ఆసక్తితో లేబర్ పార్టీలో చేరారు. అనతికాలంలోనే పార్టీలో ఉన్నత పదవులకు చేరుకున్నారు. తన పార్లమెంట్ కెరీర్‌లో షాడో క్యాబినెట్‌లో స్థానం సాధించారు. యూకేలో ప్రభుత్వ మంత్రి మండలి నిర్ణయాలను పరిశీలించడం కోసం ప్రతిపక్షం ఏర్పాటుచేసుకునే సొంత క్యాబినెట్‌ను షాడో క్యాబినెట్‌గా పిలుస్తారు. లేబర్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో షాబా జస్టిస్ సెక్రటరీ, షాడో ఎడ్యుకేషన్ సెక్రటరీగా వ్యవహరించారు. 2025లో లేబర్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఆమె హోం మంత్రిగా బాధ్యతలు అందుకున్నారు. బ్రిటన్‌కు వలసవచ్చిన పాకిస్థానీ దంపతులకు 1980లో షబానా జన్మించారు. లేబర్ పార్టీలో బలమైన నేతగా ఇప్పటికే ఆమెకు పేరుంది. ప్రస్తుత పరిస్థితుల్లో స్టార్మర్ వైదొలగాల్సి వస్తే.. పార్టీ పగ్గాలు అందుకునేందుకు ఆమె సమర్థవంతమైన నాయకురాలని లేబర్ పార్టీ నాయకులు భావిస్తున్నారు. లైంగిక నేరాల నిందితుడు ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఉన్న పార్టీ సీనియర్ నేత మాండెల్సన్‌ను అమెరికాలో రాయబారిగా నియమించిన ప్రధాని కీర్ స్టార్మర్ పదవీగండాన్ని ఎదుర్కొంటున్నారు. ఎప్‌స్టీన్ ఫైళ్ల వ్యవహారం వెలుగులోకి రాగానే మాండెల్సన్‌ను పదవి నుంచి తొలగించినా స్టార్మర్‌పై విమర్శలు ఆగడం లేదు. ఆయన రాజీనామా చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే, ఈ విషయంలో తాను చివరివరకు పోరాడుతానని ప్రధాని విశ్వాసం వ్యక్తంచేస్తున్నారు. ప్రధానిగా స్టార్మర్ బాధ్యతలు చేపట్టి ఏడాదిన్నరే అయింది.



## చర్చలొద్దు.. మా దేశంపై దాడి చేయండి

### ట్రంప్‌ను అభ్యర్థించి ఇరాన్ వ్యక్తి ఆత్మహత్య

**ఇరాన్ :** తమ దేశంతో అమెరికా చర్చలు జరపవద్దని కోరుతూ ఇరాన్‌కు చెందిన ఓ వ్యక్తి అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌ను అభ్యర్థించాడు. ఇరాన్‌పై అమెరికా దాడి చేయడమే సరైన మార్గమంటూ సామాజిక మాధ్యమాల్లో వీడియో విడుదల చేశాడు. అనంతరం ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకొని చనిపోయినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. బాధితుడిని బుషెహర్ నగరానికి చెందిన హక్కుల కార్యకర్త పౌరియా హమీదీగా గుర్తించారు. గతవారం అతడు 10 నిమిషాల వీడియోను విడుదల చేశాడు. అందులో అమెరికా ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు చేశాడు. "ఈ వీడియోను మీరు చూసే సమయానికి నేను బతికి ఉండకపోవచ్చు. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలను ఎంత ఘోరంగా అణచివేశారో అంతర్జాతీయ సమాజానికి తెలియాలి. ఇక్కడ మారణహోమం జరిగింది. దాదాపు 40వేల మందిని మా నాయకులు హత్య చేశారు. విదేశీ జోక్యం లేకుండా ఇరాన్ నాయకత్వాన్ని అడ్డుకోలేం. ఇప్పుడు మా నమ్మకమంతా అమెరికా మీదే. అలా కాదని ఇరాన్‌తో అగ్రరాజ్యం చర్చలు జరిపితే.. మమ్మల్ని మోసం చేసినట్లే. ఇరాన్‌తో సంప్రదింపులు వద్దు. మా దేశంపై దాడి చేయండి" అని హమీదీ ఆ వీడియోలో అభ్యర్థించాడు. అయితే, ఈ వీడియో ఎప్పుడు విడుదల చేశాడు.. హమీదీ ఎలా చనిపోయాడన్న దానిపై స్పష్టత లేదు. ఇటీవల ఇరాన్‌లో జరిగిన ఆందోళనలు తీవ్ర హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. నిరసనకారులను అణచివేసే క్రమంలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే, ఇరాన్ మాత్రం మరణాలపై అధికారిక సంఖ్య ఏదీ చెప్పలేదు. మరోవైపు, ఒమన్ వేదికగా ఇరాన్, అమెరికా మధ్య పరోక్ష చర్చలు జరుగుతున్నాయి. అదే సమయంలో గల్ఫ్ ప్రాంతంలో అగ్రరాజ్యం మోహరింపులు కూడా భారీగానే ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యాపారి హత్య



**మిమెన్‌సింగ్ :** బంగ్లాదేశ్‌లో మైనార్టీ వర్గంపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఫిబ్రవరి 12న ఆ దేశంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మరో హిందువు హత్యకు గురవడం చర్చనీయాంశంగా మారింది. మిమెన్‌సింగ్ జిల్లాలో సోమవారం సుసేన్ చంద్రశేఖర్ (62) అనే హిందూ వ్యాపారిని గుర్తు తెలియని దుండగులు కత్తితో పొడిచి హత్య చేసినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. మీడియా కథనాల ప్రకారం..సోమవారం రాత్రి చంద్రశేఖర్ తన బియ్యం దుకాణంలో ఉండగా లోపలికి చొరబడిన దుండగులు ఆయనపై కత్తితో దాడి చేశారు. దీంతో ఆయన అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వ్యాపారి మృతిచెందాడని ధ్రువీకరించుకున్న నిందితులు ఎవరికీ అనుమానం రాకుండా దుకాణం షట్టర్‌ను మూసివేసి.. అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం దుకాణానికి వచ్చిన చంద్రశేఖర్ కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే వ్యాపారి హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. మరో రెండు రోజుల్లో బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో హిందూ వ్యాపారి హత్యకు గురవడంతో ఆ దేశంలో హిందువుల భద్రత పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది

## పోలవరం ప్రాజెక్టుపై స్టాప్ వర్క్ ఆర్డర్

# ఎత్తివేసేలా నిర్ణయం తీసుకోవాలి

- సాగునీటి ప్రాజెక్టులు, అంతర్ రాష్ట్ర వివాదాలపై చర్చ
- కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో చంద్రబాబు భేటీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 :** ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం సమావేశమయ్యారు. ఏపీలోని వివిధ సాగునీటి ప్రాజెక్టుల అనుమతులు, ఆర్థిక సాయం, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల భవిష్యత్, తాగునీటి భద్రతకు ఇవి ఎంతో ముఖ్యమని సీఎం వివరించారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై పెండింగ్‌లో ఉన్న అంశాలతో పాటు, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపైనా ముఖ్యమంత్రి సవివరంగా చర్చించారు. సీఎం చంద్రబాబు ఈ భేటీలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ముఖ్య అంశాలను ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టుపై ఉన్న స్టాప్ వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా ఎత్తివేసేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ ఆర్డర్ వల్ల ప్రాజెక్టు అమలులో తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్నాయని వివరించారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు వల్ల పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్‌మెంట్ చేయాలన్నారు. అలాగే ఫేజ్-ఎవి పనులకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫేజ్-ఎవిలో భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టలు వంటి పనులు చేపట్టాల్సి ఉందని, దీనికి అదనంగా సుమారు రూ.32,000 కోట్ల నిధులు అవసరమని ముఖ్యమంత్రి తెలిపారు. వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో ప్రతిపాదిత పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపైనా చర్చ జరిగింది. తాగు, సాగునీరు, పరిశ్రమల అవసరాలు తీర్చే కీలక ప్రాజెక్టుగా చెప్పుకొచ్చారు సీఎం. జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా దీనికి అనుమతులు మంజూరు చేసి సాంకేతిక, ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా మధ్య వంశధార నీటి వివాదం పరిష్కరించాలని కోరారు. వంశధార నీటి వివాద ట్రిబ్యునల్ (వీడబ్ల్యుడీటీ) తుది నివేదికను వెంటనే గెజిట్‌లో ప్రచురించాలని, దీని ఆధారంగా నేరడి బ్యారేజ్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని ముఖ్యమంత్రి విన్నవించారు. గోదావరి జలాల పంపకంపై ఆంధ్రప్రదేశ్- తెలంగాణ మధ్య కొనసాగుతున్న వివాదంపై కూడా చర్చించారు. ఈ వివాదం పరిష్కారం కోసం గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు సీఎం. ఎగువ కృష్ణాపై కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు చేపట్టిన చర్యలపై సీఎం తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే దిగువ ప్రవాహ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ ఎంపీలు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సీఎం పోస్టుకు డీకే..

## హైకమాండ్‌కు 80 మంది ఎమ్మెల్యేల రిక్వెస్ట్



**కర్ణాటక :** కర్ణాటకలో సీఎం పోస్టుపై ఎప్పటికప్పుడు ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇప్పుడేమోను సీఎం చేయమని 80 మంది ఎమ్మెల్యేలు హైకమాండ్‌కు అభ్యర్థన చేశారట. తాజాగా ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ వెల్లడించడం చర్చనీయాంశంగా మారింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. "సీఎం పదవి విషయంలో డీకేకు ఒక ఛాన్స్ ఇవ్వాలని 80-90 మంది ఎమ్మెల్యేలు హైకమాండ్‌ను అభ్యర్థించారు. ఇప్పుడు ఈ నిర్ణయం అధిష్ఠానం చేతుల్లోనే ఉంది. మాది క్రమశిక్షణ కలిగిన పార్టీ. దానికి తగ్గట్టే మేం ప్రవర్తించాలి. ఆయన (యతీంద్ర సిద్ధరామయ్య) తండ్రికి అనుకూలంగా పదేపదే మాట్లాడటం ఇబ్బందిగా ఉంది. కానీ రాజకీయాల విషయానికి వస్తే.. క్రమశిక్షణే ముఖ్యం. తమ వ్యాఖ్యలతో ఇతరులను రెచ్చగొట్టాలని చూడటం సరికాదు. డీకేకు ఒక అవకాశం ఇవ్వాలని మా అందరి కోరిక. కానీ దానిగురించి బహిరంగంగా ప్రకటనలు చేసి, గందరగోళం సృష్టించకూడదు" అని ఇక్బాల్ మీడియాతో మాట్లాడారు. మరోవైపు, డీకే దిల్లీకి వెళ్తున్నారు. "కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశం కానున్నాను. అయితే ఎవరిని కలుస్తాననే విషయం మాత్రం చెప్పలేను. మీరెందుకు అంత ఆసక్తి చూపిస్తున్నారు. నేను డిప్యూటీ సీఎం పదవితో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ ఉన్నాను. దాంతో ఈ సమావేశాలు సర్వసాధారణమే. అలాగే కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ కానున్నాను" అని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఎమ్మెల్యే ఇక్బాల్ వ్యాఖ్యల వేళ.. ఈ పర్యటన జరుగుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# జపాన్‌లో అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రం పునఃప్రారంభం



**టోక్యో:** ప్రపంచంలోనే అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రమైన కాషివాజాకి-కరీవా ప్లాంట్‌ను జపాన్ సోమవారం పునఃప్రారంభించింది. గతంలో సాంకేతిక లోపం కారణంగా నిలిచిపోయిన ఈ కర్మాగారం తిరిగి విద్యుదుత్పత్తికి సిద్ధమైంది. 2011లో సంభవించిన భారీ భూకంపం, సునామీ కారణంగా ఫుకుషిమా ప్లాంట్‌లో ప్రమాదం సంభవించింది. దీంతో దేశవ్యాప్తంగా అణు విద్యుత్ కేంద్రాలను జపాన్ ప్రభుత్వం మూసివేసింది. ఆ తర్వాతి పరిస్థితుల్లో.. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని భావించింది. 2050 నాటికి 'కార్బన్ న్యూట్రాలిటీ' సాధించడానికి, కృత్రిమ మేధ (ఏఐ) అవసరాలకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి మళ్లీ అణుశక్తి వైపు మొగ్గు చూపుతోంది. ఈ నేపథ్యంలో కాషివాజాకి-కరీవా ప్లాంట్‌ను పునఃప్రారంభించడానికి జనవరిలో మొదటిసారి ప్రయత్నించారు. అయితే, మానిటరింగ్ అలారం మోగడంతో ఆ ప్రయత్నాన్ని తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది. ఈ కర్మాగారంలోని ఒక రియాక్టర్ సోమవారం మధ్యాహ్నం 2:00 గంటలకు తిరిగి ప్రారంభమైనట్లు టోక్యో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీ (టీఈపీసీఓ) ఒక ప్రకటనలో తెలిపింది. వచ్చేనెలలో సమగ్ర తనిఖీ ముగిశాక ఈ ప్లాంట్‌లో పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఈ కర్మాగారంలో మొత్తం ఏడు రియాక్టర్లు ఉన్నాయి.

# డీల్ కుదిరినా.. 1% టారిఫ్‌ల తగ్గింపే..

### అమెరికా-బంగ్లాదేశ్ ఒప్పందం



**యూఎస్ :** వ్రతం చెడ్డా.. ఫలం దక్కాలి అనేది సామెత.. కానీ, బంగ్లాదేశ్ విషయంలో దీనికి భిన్నంగా జరిగింది.. అమెరికాతో డీల్ కుదిరినా ఆశించిన ఫలం దక్కలేదు..! అమెరికా-బంగ్లాదేశ్ మధ్య సోమవారం వాణిజ్య ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దీని ప్రకారం ఆ దేశంపై టారిఫ్‌లు 20 శాతం నుంచి 19 శాతానికి తగ్గనున్నాయి. సోమవారం అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్, బంగ్లా ప్రతినిధి షేక్ బషీరుద్దీన్ సంతకాలు చేశారు. ఈ విషయాన్ని శ్వేతసౌధం ఓ ప్రకటనలో ధ్రువీకరించింది. ఈ ఒప్పందం ప్రకారం బంగ్లాదేశ్ టెక్స్‌టైల్స్, అప్పెరల్స్ సరకులపై మినహాయింపులు పొందేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తుంది. అయితే అమెరికాలో తయారైన కాటన్ ఉపయోగించేందుకు బంగ్లాదేశ్ అంగీకరించినట్లు ఆ దేశ సలహాదారు మహమ్మద్ యూనస్ స్వయంగా సోషల్ మీడియాలో వెల్లడించారు. గతంలో బంగ్లాదేశ్‌పై ట్రంప్ 37 శాతం టారిఫ్‌లు విధించగా.. ఆ తర్వాత దానిని 20 శాతానికి తీసుకొచ్చారు. ఈ ఒప్పందం తర్వాత మరొక శాతం తగ్గించి 19 శాతం వద్ద స్థిరీకరించారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం 18 శాతం టారిఫ్‌ల వద్ద కుదరడంతో.. వస్త్ర పరిశ్రమ ఆధారిత ఆర్థికవ్యవస్థ అయిన బంగ్లాదేశ్‌లో కంగారు మొదలైంది. దీంతో దేశంలో ఎన్నికల వేళ భారత్ కంటే తక్కువ టారిఫ్‌లతో ఒప్పందం కుదుర్చుకొనేందుకు యత్నించింది. ఈ క్రమంలో అమెరికా పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, మెడికల్ పరికరాలు, ఆటోపార్టులు, ఇంధన ఉత్పత్తులకు బంగ్లాదేశ్ మార్కెట్‌ను తెరిచేందుకు అంగీకరించింది.



## స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం

### నోటీసులు ఇచ్చిన కాంగ్రెస్ తదితర పార్టీలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 :** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసులు అందజేశారు. అవిశ్వాసం నోటీసులపై 119 మంది ఎంపీలు సంతకాలు చేశారు. కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ ఎంపీలు సంతకాలు చేసిన వారిలో ఉన్నారు. అయితే ఇండియా కూటమిలోని కొన్ని పార్టీలు అవిశ్వాసం నోటీసులపై సంతకాలు చేసేందుకు ఒప్పుకోలేదు. ఈ అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చేందుకు టీఎంసీ నిరాకరించింది. సభలో తాము మాట్లాడేందుకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. తాజా బడ్జెట్ సమావేశాల సందర్భంగా 8 మంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. భారత్-చైనా ఉద్రిక్తతలకు సంబంధించి ఆర్మీ మాజీ చీఫ్ నరవణె అముద్రిత పుస్తకంలోని అంశాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చర్చకు పట్టుబట్టిన నేపథ్యంలో ఎంపీలు నిరసనలకు దిగి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలోనే స్పీకర్ తీరుపై ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానానికి పూనుకుంది. సాధారణంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఆ ప్రకారం బడ్జెట్ రెండో విడత సమావేశాల్లో అవిశ్వాస తీర్మనం సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. బడ్జెట్ తొలి విడత సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13న ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9న ప్రారంభమై ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి.



## హైవేపై విమానం ల్యాండింగ్..

### పలు వాహనాలు ధ్వంసం

**జార్జియా :** రద్దీగా ఉన్న హైవేపై విమానం ల్యాండ్ అవడంతో పలు వాహనాలు ధ్వంసమైన ఘటన అమెరికాలోని జార్జియాలో చోటుచేసుకుంది. సాంకేతిక లోపం తలెత్తిన సింగిల్ ఇంజిన్ శిక్షణ విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేయడానికి ప్రయత్నిస్తుండగా ఈ ఘటన జరిగినట్లు అమెరికా జాతీయ రవాణా భద్రతా బోర్డు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలైనట్లు తెలిపారు. దీంతో రహదారిని మూసివేశామన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో హైవేపై అనేక కార్లు ఉన్న సమయంలో ఒక్కసారిగా విమానం రోడ్డుపై ల్యాండ్ అయ్యి, వాటిని ఢీకొట్టినట్లు కనిపిస్తోంది. లీ గిల్మర్ మెమోరియల్ విమానాశ్రయం నుంచి కాంటన్‌లోని చెరోకీ కౌంటీ విమానాశ్రయానికి బయల్దేరిన కొద్దిసేపటికే విమానం ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తినట్లు పైలట్ గుర్తించాడని అధికారులు తెలిపారు. ఫ్లైట్‌ను విమానాశ్రయానికి తీసుకువెళ్లడానికి తగినంత సమయం లేకపోవడంతో వెంటనే హైవేపై ల్యాండ్ చేయాల్సి వచ్చిందన్నారు. ఈ ఘటనపై ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



## కెనడా-అమెరికా మధ్య వంతెనను బ్లాక్ చేస్తాం : ట్రంప్

**యూఎస్ :** కెనడాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. ఇప్పటివరకు అమెరికా నుంచి పొందిన అన్ని ప్రయోజనాలకు ప్రతిఫలంగా తిరిగి తమకు మూల్యం చెల్లించాలని.. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ దేశాన్ని హెచ్చరించారు. తమ నుంచి పొందిన వాటికి పూర్తి పరిహారం చెల్లించేవరకు కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్‌ను అమెరికాలోని మిచిగాన్‌తో కలిపే గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెనను బ్లాక్ చేస్తామని బెదిరించారు. 2014లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా తెలివి తక్కువగా ఆలోచించి ఈ వంతెన నిర్మాణానికి కావల్సిన మినహాయింపులు ఇచ్చారని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వంతెన నిర్మాణానికి అయిన ఖర్చులో సగమైనా అమెరికాకు చెల్లించాలని, లేదా వంతెనపై ఇరుదేశాలకు సమాన యాజమాన్య హక్కులు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని ట్రంప్ కెనడాకు సూచించారు. వాణిజ్య ఒప్పందాల విషయంలో ఇరుదేశాల మధ్య ఇటీవల తలెత్తిన విభేదాల గురించి ట్రంప్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా తమ దేశం నుంచి పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి కెనడా వసూలు చేస్తున్న సుంకాలు ఆమోదయోగ్యమైన రీతిలో లేవన్నారు. అగ్రదేశాన్ని కాదని.. చైనాతో వ్యాపారం చేసేందుకు ఆ దేశం మొగ్గు చూపడాన్ని ఆయన తప్పుబట్టారు. దీనికి వారు మూల్యం చెల్లించుకుంటారన్నారు. వంతెన ప్రాజెక్ట్‌కు సంబంధించిన వెబ్‌సైట్ ప్రకారం.. డెట్రాయిట్ నదిపై ఏర్పాటు చేసిన గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెనను కెనడియన్ ప్రభుత్వానికి చెందిన విండ్సర్-డెట్రాయిట్ బ్రిడ్జ్ అథారిటీ అనే సంస్థ నిర్మించింది. దీనికి అక్కడి ప్రభుత్వమే నిధులు సమకూర్చింది. ఈ ఏడాదిలో దీనిని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలో ట్రంప్ హెచ్చరికలు చేయడం గమనార్హం. అయితే దీనిపై కెనడా ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# వాట్సప్ వెబ్‌లో కొత్త ఫీచర్.. యాప్ లేకుండానే కాల్స్

ప్రముఖ మేసేజింగ్ యాప్ వాట్సప్ తన వెబ్ వెర్షన్‌లో కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. కొత్తగా వాయిస్, వీడియో కాలింగ్ ఆప్షన్లను అందుబాటులోకి తెచ్చింది. దీంతో యూజర్లు ఎలాంటి అదనపు సాఫ్ట్‌వేర్ ఉపయోగించకుండానే నేరుగా వెబ్ నుంచే ఆడియో/వీడియో కాల్స్ చేసుకోవచ్చు. యూజర్లు వ్యక్తిగత చాట్ విండోలో కాల్ బటన్ కనిపిస్తుంది. కొద్దిమంది యూజర్లకు మాత్రమే ప్రస్తుతం ఈ ఫీచర్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. వాట్సప్‌లో ప్రస్తుతం ఆడియో, వీడియో కాల్స్ మాట్లాడాలంటే.. మొబైల్ యాప్ ఉండాలి. ల్యాప్‌టాప్/ పీసీలపై పనిచేసేవారైతే వాట్సప్ విండోస్ లేదా మ్యాక్ వెర్షన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇప్పుడు వాట్సప్ వెబ్‌లోనే ఈ సదుపాయం అందుబాటులోకి వస్తోంది. ఎవరికైనా కాల్ చేయాల్సివస్తే ఎలాంటి యాప్ డౌన్‌లోడ్ అవసరం లేకుండా ఇకపై నేరుగా కాల్స్ చేయొచ్చు. పరిమిత సంఖ్యలో యూజర్లకు తీసుకొచ్చిన ఈ సదుపాయం త్వరలో అందరికీ రానుంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ మాదిరిగా వాట్సప్ వెబ్ నుంచి చేసే కాల్స్‌కు కూడా ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ ఉంటుంది.









# గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి నిధుల వరద..

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయి. జనవరి నెలలో నికరంగా రూ.24,028 కోట్లు మాత్రమే వచ్చాయి. అంతకుముందు నెలతో పోలిస్తే నిధుల ప్రవాహం 14 శాతం తగ్గుముఖం పట్టింది. ఈక్విటీల్లోకి పెట్టుబడులు తగ్గడం వరుసగా రెండో నెల. మార్కెట్ పరిస్థితులు, భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించడం ఇందుకు కారణం. అదే సమయంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలోకి భారీగా పెట్టుబడులు తరలిరావడం విశేషం. ఈ మేరకు మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ యాంఫీ జనవరి నెలకు సంబంధించిన గణాంకాలను విడుదల చేసింది. యాంఫీ డేటా ప్రకారం.. మ్యూచువల్ ఫండ్ల సంస్థల (ఏఎంసీ) నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల విలువ పెరిగింది. డిసెంబర్‌లో రూ.80.23 లక్షల కోట్లుగా ఉన్న ఈ విలువ రూ.81.01 లక్షల కోట్లకు చేరింది. మొత్తంగా మ్యూచువల్ ఫండ్స్ నుంచి డిసెంబర్‌లో రూ.66,591 కోట్ల నిధులు తరలిపోగా.. జనవరి నెలలో వివిధ కేటగిరీల్లో నికరంగా రూ.1.56 లక్షల కోట్ల నిధులు వచ్చాయి. ఈక్విటీ స్కీమ్స్‌లో ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.7,672 కోట్లు, మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.3,185 కోట్లు, లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.3,182 కోట్లు చొప్పున నిధులను ఆకర్షించాయి. లార్జ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.2,005 కోట్లు రాగా.. స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.2,942 కోట్లు నిధులొచ్చాయి. ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్స్ నుంచి రూ.593.69 కోట్లు తరలిపోయాయి. మదుపర్ల నుంచి ప్రాఫిట్ బుకింగ్, ట్యాక్స్ సంబంధిత అడ్జెస్ట్‌మెంట్ల వల్ల ఈ పరిస్థితి నెలకొందని యాంఫీ పేర్కొంది. ఇదే నెలలో డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లోకి రూ.74,827 కోట్ల నిధులు వచ్చాయని తెలిపింది.

**గోల్డ్ రష్:** బంగారం ధరల్లో భారీ పెరుగుదల నేపథ్యంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి నిధులు భారీగా తరలివచ్చాయి. డిసెంబర్ నెలలో రూ.11,647 కోట్ల పెట్టుబడులు గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రాగా.. జనవరిలో రూ.24,040 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. అంటే నెలవారీగా చూసినప్పుడు నిధులు రెట్టింపయ్యాయి. దాదాపు ఈక్విటీ పెట్టుబడులతో సమానంగా ఈ కేటగిరీలోకి నిధులు తరలివచ్చాయి.



## అమెరికాపై గెలిచిన పాకిస్తాన్

**కొలంబో :** కొలంబో వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు విజయం సాధించింది. అమెరికాపై 32 పరుగుల తేడాతో గెలిచింది. కొన్నిరోజుల క్రితం టీమిండియాపై అద్భుతంగా ఆడిన అమెరికా జట్టు.. ఇప్పుడు పాక్‌పై కూడా అదే జోరు ప్రదర్శించింది. కానీ గెలుపు రుచిచూడలేకపోయింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కి దిగిన పాక్ జట్టు.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగుల స్కోరు చేసింది. ఫర్హాన్ 73 పరుగులతో ఆకట్టుకునే ప్రదర్శన చేశాడు. బాబర్ ఆజమ్ 46 పరుగులతో ఆకట్టుకున్నాడు. అమెరికా బౌలర్లలో షాడ్లీ 4 వికెట్లతో మంచి ప్రదర్శన చేశాడు. అనంతరం అమెరికా జట్టు.. దూకుడుతో ఛేదన మొదలుపెట్టింది. కానీ వరస విరామాల్లో వికెట్లు కోల్పోవడంతో నిర్ణీత ఓవర్లన్నీ పూర్తి చేసినప్పటికీ.. 8 వికెట్ల నష్టానికి 158 పరుగులు మాత్రమే చేయగలిగింది. శుభం రంజనే 51, షయన్ జహంగీర్ 49 పరుగులతో మెప్పించారు. పాక్ బౌలర్లలో ఉస్మాన్ తారీఖ్ 3, షాదాబ్ ఖాన్ 2 వికెట్లు తీశారు.

# తోక ముడిచిన పాక్

### ఫిబ్రవరి 15న భారత్, పాకిస్తాన్ జట్ల పోరు



తప్పని పరిస్థితుల్లో పాకిస్తాన్ తోక ముడిచింది. మేకపోతు గాంభీర్యం ప్రదర్శించినా చివరికి తన నిర్ణయం మార్చుకోవలసి వచ్చింది. పాకిస్తాన్ ప్రభుత్వం తమ జట్టు టీ20 ప్రపంచ కప్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడదని ఫిబ్రవరి 1న ప్రకటించింది. కొన్ని రోజుల హైడ్రామా తర్వాత, పాకిస్తాన్ జట్టు టీమిండియాతో మ్యాచ్ ఆడుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొదట పాక్ కి 3 కండీషన్లు పెట్టింది. అయితే వాటిని అంగీకరించలేదు. దాంతో చివరికి పాకిస్తాన్ ప్రభుత్వం, పీసీబీ దిగి రావాల్సి వచ్చింది. ఇప్పుడు భారత్, పాకిస్తాన్ మ్యాచ్ కోసం ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ ప్రేమికులు ఎదురుచూస్తున్నారు. టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా భారత్, పాకిస్తాన్ ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. ఈ ఆసియా జట్లు గ్రూప్-ాలో ఉన్నాయి. భారత్ తన మొదటి మ్యాచ్‌లో అమెరికా (ఖూూ)ని ఓడించగా, నెదర్లాండ్స్‌తో జరిగిన తన మొదటి మ్యాచ్‌లో పాకిస్తాన్ విజయం సాధించింది. పాకిస్తాన్ నెక్ట్స్ మ్యాచ్ అమెరికాతో తలపడనుంది. భారత్ గురువారం నాడు తమ రెండో మ్యాచ్ నమీబియాతో ఆడనుంది. తమ మూడవ మ్యాచ్‌లో భారత్, పాకిస్తాన్ జట్లు ఢీకొంటాయి. మైదానం బయట మాటల తూటాలు పేల్చుతున్న పాక్ జట్టు మ్యాచులో ఏం చేస్తుంది, ఎలాంటి ప్రదర్శన చేస్తుంది అనేది ఆసక్తికరంగా మారింది. టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్, పాకిస్తాన్ జట్ల పోరు 27వ మ్యాచ్ అవుతుంది. ఈ మ్యాచ్ ఆదివారం (ఫిబ్రవరి 15న) ఐసీసీ షెడ్యూల్ చేసింది. భారత్, పాక్ మధ్య మ్యాచ్ తటస్థ వేదికలో జరుగుతుంది. గత కొన్నేళ్లుగా పాక్ లో మ్యాచులు ఆడటం లేదు. అయితే ఐసీసీ ఈవెంట్లలో మాత్రం ×జజ ఈవెంట్స్‌లో భారత్ లో మ్యాచ్‌లు నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ తరువాత పాక్ జట్టు భారత్ రావడానికి నిరాకరిస్తోంది. భారత్ సైతం పాక్ తో స్వదేశంలో మ్యాచులకు సిద్ధంగా లేదు. టీ20 వరల్డ్ కప్ లో ఈ జట్లు తటస్థ వేదిక అయిన కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో జరుగుతుంది. ఈసారి పొట్టి ప్రపంచ కప్‌ను భారత్, శ్రీలంక జట్లు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఫిబ్రవరి 15న టీ20 ప్రపంచ కప్‌లో మొత్తం 3 మ్యాచ్‌లు ఉన్నాయి. టీమిండియా, పాకిస్తాన్ మ్యాచ్ వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతుంది. టాస్ 6:30 గంటలకు వేస్తారు. భారత్, పాక్ మ్యాచ్ కనుక వీకెండ్ అందులోనూ ఆదివారం వచ్చేలా ఐసీసీ షెడ్యూల్ చేసింది. ఈ మ్యాచ్ బ్రేక్ 10 సెకన్ల యాడ్ సైతం ఐసీసీకి కోట్లలో ఆదాయం సమకూరుస్తుంది. భారత్, పాకిస్తాన్ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. జియోహాట్‌స్టార్ యాప్, వెబ్‌సైట్‌లో భారత్, పాకిస్తాన్ టీ20 ప్రపంచ కప్ మ్యాచ్ లైవ్ ఇస్తారు. రాత్రి 7 గంటలకు ఈ ఉత్కంఠభరిత పోరు ప్రారంభం కానుంది.



## 'బాస్' ఆల్‌రౌండ్ షో..

### పసికూనల పోరులో నెదర్లాండ్స్ గెలుపు

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా జరిగిన పోరులో పసికూనలు నెదర్లాండ్స్, నమీబియా తలపడ్డాయి. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ పైచేయి సాధించింది. బాస్ డి లీడ్ ఆల్‌రౌండ్ మెరుపుల కారణంగా 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. లీడ్ తొలుత బంతితో (3-0-20-2), ఆతర్వాత బ్యాట్‌తో (48 బంతుల్లో 72 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) సత్తా చాటి నెదర్లాండ్స్‌ను ఒంటిచేత్తో గెలిపించాడు. ఈ గెలుపుతో నెదర్లాండ్స్ ప్రస్తుత ఎడిషన్‌లో బోణీ కొట్టింది. ఈ జట్టు తొలి మ్యాచ్‌లో పాక్ చేతిలో ఖంగుతింది. మరోవైపు నబీమియాకు ఇదే తొలి మ్యాచ్. తొలి మ్యాచ్‌లోనే ఆ జట్టు పరాజయంపాలైంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. జాన్ ఫ్రైలింక్ (30), జాన్ నికోల్ లాఫ్టీ ఈటన్ (42) ఓ మోస్తరు స్కోర్లు సాధించి నమీబియాకు గౌరవప్రదమైన స్కోర్ అందించారు. మిగతా బ్యాటర్లలో జేజే స్మిట్ (22), కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్ (18) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. నెదర్లాండ్స్ బౌలర్లలో లొగన్ వాన్ బీక్, బాస్ డి లీడ్ తలో 2 వికెట్లు పడగొట్టగా.. ఆర్యన్ దత్, ఫ్రెడ్ క్లాస్సెన్ చెరో వికెట్ దక్కించుకున్నారు. అనంతరం ఓ మోస్తరు లక్ష్యాన్ని నెదర్లాండ్స్ సునాయాసంగా ఛేదించింది. బాస్ డి లీడ్ అజేయమైన మెరుపు ఇన్నింగ్స్‌తో ఆ జట్టును విజయతీరాలకు చేర్చాడు. లీడ్‌తో పాటు కొలిన్ ఆకెర్‌మన్ (32), మైఖేల్ లెవిట్ (28), స్కాట్ ఎడ్వర్డ్స్ (18 నాటౌట్) కూడా రాణించడంతో నెదర్లాండ్స్ 18 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. నమీబియా బౌలర్లలో బెర్నాల్డ్ స్కోల్జ్, రూబెన్ ట్రంపెల్మన్, నికోల్ లాఫ్టీకి తలో వికెట్ దక్కింది.

# న్యూజిలాండ్ ఓపెనర్ల ఊచకోత




టీ20 వరల్డ్‌కప్ 2026లో న్యూజిలాండ్ జట్టు వరుస విజయాలతో దూసుకుపోతుంది. తొలి మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన ఈ జట్టు.. తాజాగా (ఫిబ్రవరి 10) యూఏఈపై 10 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో యూఏఈ నిర్దేశించిన 174 పరుగుల లక్ష్యాన్ని ఓపెనర్లే ఊదేశారు. ఫిన్ అలెన్ (50 బంతుల్లో 84 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్సర్లు), టిమ్ సీఫర్ట్ (42 బంతుల్లో 89 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) ఊచకోత ధాటికి న్యూజిలాండ్ కేవలం 15.2 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా లక్ష్యాన్ని ఛేదించింది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యంగా నిలిచింది. సీఫర్ట్-అలెన్ దెబ్బకు యూఏఈ బౌలర్లు బెంబేలెత్తిపోయారు. వీరిద్దరు పడ్డ బంతిని పడ్డట్టు ఎడాపెడా బాదారు. అలెన్ కాస్త నిదానంగా ఆడినా, సీఫర్ట్ మాత్రం బౌండరీలు, సిక్సర్లతో చెలరేగిపోయాడు. విన్నింగ్ రన్స్‌ను కూడా సీఫర్ట్ సిక్సర్‌తోనే సాధించాడు. అలెన్ తన హాఫ్ సెంచరీని 27 బంతుల్లో పూర్తి చేస్తే, సీఫర్ట్ కేవలం 23 బంతుల్లోనే పని కానిచ్చేశాడు. ఫలితంగా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన గత మ్యాచ్‌లోనూ సీఫర్ట్ ఇదే తరహా విధ్వంసం (42 బంతుల్లో 65; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) సృష్టించి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. సీఫర్ట్ ధాటికి ఆ మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్యాన్ని కివీస్ 17.5 ఓవర్లలోనే ఛేదించింది. సీఫర్ట్ విధ్వంసకర ఫామ్ చూస్తుంటే, ఈ ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌ను ఆపడం కష్టమేమో అనిపిస్తుంది. అతనికి ఫిన్ అలెన్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, డారిల్ మిచెల్, మార్క్ చాప్‌మన్ లాంటి బ్యాటర్లు తోడైతే, బ్యాటింగ్‌కు స్వర్గధామమమైన ఉపఖండపు పిచ్‌లపై న్యూజిలాండ్‌ను ఆపడం కష్టమే. బ్యాటింగ్ విషయాన్ని పక్కన పెడితే, ప్రస్తుత న్యూజిలాండ్ జట్టు బౌలింగ్‌లో మరింత ప్రమాదకరంగా ఉంది. ఆ జట్టులో డఫీ, హెన్రీ, ఫెర్గూసన్, నీషమ్ లాంటి ప్రమాదకర ఫాస్ట్ బౌలర్లు ఉన్నారు. అలాగే స్పిన్ విభాగంలో మిచెల్ సాంట్నర్ లాంటి టాప్ స్పిన్నర్ ఉన్నాడు. ఈ గెలుపుతో గ్రూప్-డి నుంచి న్యూజిలాండ్ సూపర్-8 బెర్త్ దాదాపుగా ఖరారైనట్లే.

### అసాధారణ ప్రదర్శన

ఈ మ్యాచ్‌లో యూఏఈ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ జట్టు బ్యాటర్లు అసాధారణ ప్రదర్శన కనబర్చారు. పటిష్టమైన న్యూజిలాండ్ బౌలింగ్ లైనప్‌ను ఎదుర్కొని నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేశారు. టీ20 వరల్డ్‌కప్ చరిత్రలో యూఏఈకి ఇదే అత్యధిక టీమ్ స్కోర్. కెప్టెన్ ముహమ్మద్ వసీం (66 నాటౌట్), అలీషాన్ షరాఫు (55) కలిసి యూఏఈకి ఈ రికార్డు స్కోర్ అందించారు. ఆఖర్లో మయాంక్ కుమార్ (21) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 2 వికెట్లు తీయగా.. డఫీ, ఫెర్గూసన్, సాంట్నర్, ఫిలిప్స్ తలో వికెట్ తీశారు.

### బెంబేలెత్తిపోయిన యూఏఈ బౌలర్లు

174 పరుగుల లక్ష్య ఛేదనను న్యూజిలాండ్ ఓపెనర్లు ఆచితూచి ప్రారంభించారు. అయితే వీరిద్దరు క్రమంగా గేర్ మార్చి వీలు చిక్కనప్పుడల్లా యూఏఈ బౌలర్లును ఉతికి ఆరేశారు. వీరి ధాటికి రోహిద్ ఖాన్ 3.2 ఓవర్లలో 51 పరుగులు, జునైద్ సిద్దిఖీ 4 ఓవర్లలో 47 పరుగులు, అర్ఫాన్ 3 ఓవర్లలో 36 పరుగులు సమర్పించుకున్నారు. యూఏఈ బౌలర్లలో హైదర్ అలీ (4-0-27-0) ఒక్కడు కాస్త పొదుపుగా బౌలింగ్ చేశాడు. మొత్తంగా టిమ్ సీఫర్ట్, ఫిన్ అలెన్ ధాటికి యూఏఈ బౌలర్లు బెంబేలెత్తిపోయారు.



### భారత్‌పై అమెరికా జీరో టారిఫ్‌లు విధిస్తే..

## క్రికెట్ మ్యాచ్ గెలిచేది

### పీయూష్ గోయల్

టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్, యూఎస్ఏ మ్యాచ్‌కు సుంకాలను ముడిపెడుతూ కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సరదాగా వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై అమెరికా జీరో టారిఫ్‌లు విధించి ఉంటే.. క్రికెట్ మ్యాచ్ గెలిచేదని అన్నారు. భారత్-అమెరికా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి (ఖీూ) అంగీకారం కుదిరిన సంగతి తెలిసిందే. భారత్ ఉత్పత్తులపై సుంకాలను అగ్రరాజ్యం 18 శాతానికి తగ్గించింది. ఈ డీల్ నేపథ్యంలో భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఇచ్చిన విందుకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో యూఎస్ఏ టీమ్‌కు విజయం దక్కకపోయినా.. ఆట తీరు అద్భుతం. క్రికెట్ గురించి పెద్దగా తెలియకపోయినా.. కొన్నేళ్లక్రితమే ఆటను మొదలుపెట్టిన ఈ జట్టు మెరుగైన ప్రదర్శన చేసింది. సెర్గియో ఈ గేమ్‌ను బాగా ఎంజాయ్ చేశారు. 18 శాతం సుంకాలు విధించకపోయి ఉంటే.. గెలిచి ఉండేవాళ్లమని అప్పుడు సెర్గియో అనుకొని ఉంటారు. ఈ సందర్భంగా ఆయనకు ఒక సూచన చేస్తున్నాను. భారత్‌పై అమెరికా జీరో టారిఫ్‌లు విధించి ఉంటే.. మీ టీమ్ మ్యాచ్ గెలిచిఉండేది. ఏదేమైనప్పటికీ.. అమెరికా జట్టు ప్రదర్శన చూసి నేను ఆశ్చర్యపోయాను" అని గోర్‌ను ఉద్దేశించి మంత్రి అన్నారు. టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా శనివారం రాత్రి భారత్, యూఎస్ఏ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌తో ఆతిథ్య భారత్ శుభారంభం చేసింది. ముంబయి వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో అమెరికాపై 29 పరుగుల తేడాతో విజయం సాధించింది. చివరివరకు పోరాడినా యూఎస్ఏ ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. యూఎస్ఏ జట్టు ఆటతీరుకు ప్రశంసలు దక్కాయి.

రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# విశ్వంభరకు ప్రత్యేకంగా టైటిల్ కార్డ్స్




మెగాస్టార్ చిరంజీవి, వశిష్ట కాంబినేషన్‌లో రాబోతున్న సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' సినిమాపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా టైటిల్ కార్డ్స్ విషయంలో దర్శకుడు వశిష్ట తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన 'లియో' సినిమా తర్వాత యానిమేటెడ్ టైటిల్ కార్డ్స్ వేయడం అనేది ఒక ట్రెండ్‌గా మారిపోయిందన్న సంగతి తెలిసిందే, అయితే తన సినిమా కోసం ఆ రొటీన్ ఫార్ములాను ఫాలో అవ్వడం తమకు ఇష్టం లేదని వశిష్ట క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ ట్రెండ్‌ను బ్రేక్ చేస్తూ 'విశ్వంభర' కాన్సెప్ట్‌ను ప్రతిబింబించేలా ఏకంగా ఎనిమిది రకాల ప్రత్యేకమైన మెగాస్టార్ టైటిల్ కార్డ్ డిజైన్స్‌ను చిత్ర బృందం రూపొందించినట్లు తెలుస్తుంది. పంచభూతాల నేపథ్యంలో సాగే ఈ ఫాంటసీ అడ్వెంచర్‌లో ప్రతి టైటిల్ కార్డ్ ఒక ప్రత్యేకమైన ఎలిమెంట్‌ను ప్రేక్షకులకు పరిచయం చేయబోతోంది. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో, చిరంజీవి ఇమేజ్‌ను మరో లెవల్‌లో చూపిస్తూ ఈ కార్డ్స్ డిజైన్ చేయబడ్డాయి. కేవలం టైటిల్ కార్డ్స్ కోసమే దర్శకుడు ఇంతటి కసరత్తు చేశారంటే, వెండితెరపై సినిమా ఏ స్థాయి విజువల్ వండర్‌గా ఉండబోతుం దోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టించడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.



# బాలీవుడ్‌లోకి కిరణ్ అబ్బవరం

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో మరో భారీ అడుగు వేయబోతున్నారు. 'క' చిత్రంతో పాన్-ఇండియా స్థాయిలో తన సత్తా చాటిన కిరణ్, ఇప్పుడు బాలీవుడ్ ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా నిర్మాణంలో ఒక భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు సంతకం చేసినట్లు తెలుస్తుంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని జీ స్టూడియోస్ అధినేత ఉమేష్ బన్సాల్‌తో కలిసి ప్రేరణ అరోరా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించనుండగా, కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరి స్తున్నారు. భారతీయ సంస్కృతి మరియు పురాణాల నేపథ్యంలో సాగే ఒక అద్భుతమైన మైథాలజీ యాక్షన్ ఎంటట్రంల్గ÷నర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమా కోసం మేకర్స్ సరికొత్త ప్రపంచాన్ని సృష్టించబోతున్నారు. గ్రాండ్ విజువల్స్ మరియు హై టెక్నికల్ వాల్యూస్‌తో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ చిత్రం రూపొందనుంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా, అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సెప్టెంబర్ నెల నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాలని చిత్ర బృందం నిర్ణయించినట్లు సమాచారం. ఈ భారీ ప్రాజెక్ట్ కోసం బాలీవుడ్ లేదా టాలీవుడ్‌కు చెందిన ఒక అగ్ర నటిని హీరోయిన్‌గా ఎంపిక చేసే పక్రియలో చిత్ర యూనిట్ ఉంది. భక్తి, భావోద్వేగాలు, డ్రామా మరియు హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌ల కలయికతో ఈ కథ ఉండబోతోందని, ప్రేక్షకులకు ఇది ఒక సరికొత్త దృశ్యకావ్యాన్ని అందిస్తుందని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సినిమా టైటిల్, దర్శకుడు మరియు ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. 'క' సినిమా విజయంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కిరణ్ అబ్బవరం, ఈ గ్లోబల్ ప్రాజెక్ట్‌తో బాక్సాఫీస్ వద్ద తనదైన ముద్ర వేయాలని సిద్ధమవుతున్నారు.



# మనుషులుగా గుర్తించాలి

## కామాక్షి భాస్కర్ల

పొలిమేర ఫేమ్ కామాక్షి భాస్కర్ల సోషల్ మీడియాలో తనపై వచ్చిన ఒక అసభ్యకరమైన ప్రశ్నకు అత్యంత చాకచక్యంగా సమాధానం ఇచ్చి వార్తల్లో నిలిచింది. సాధారణంగా సెలబ్రిటీలు ఇలాంటి చిల్లర ప్రశ్నలను పట్టించుకోరు, కానీ కామాక్షి ఒక అడుగు ముందుకు వేసి సదరు నెటిజన్‌కు దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చింది. "అందమైన అమ్మాయిలు అసలు పూప్ చేస్తారా?" అని ఒక నెటిజన్ అడిగిన ప్రశ్నకు ఆమె స్పందించిన తీరు ప్రస్తుతం నెట్టింట సంచలనంగా మారింది. వృత్తిరీత్యా నటి మాత్రమే కాకుండా డాక్టర్ కూడా అయిన కామాక్షి ఈ ప్రశ్నకు స్పందిస్తూ.. "మా కడుపులు సిమెంట్, కాంక్రీటుతో తయారయ్యాయి. అందుకే మేము తినే ఆహారం అంతా మాయమైపోతుంది. అది నేరుగా ఆర్గానిక్ ఫార్మింగ్‌కు ఉపయోగపడుతుంది" అంటూ తనదైన శైలిలో సెటైర్ వేసింది. సెలబ్రిటీలు కూడా సాధారణ మనుషులే అన్న విషయాన్ని మర్చిపోయి ఇలాంటి విడ్డూరమైన ప్రశ్నలు అడిగే వారికి తనదైన వ్యంగ్యంతో సమాధానం చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచింది. సైన్స్‌తో సంబంధం లేని ఇలాంటి ప్రశ్నలకు తన హాస్యం తోడైతేనే కరెక్ట్ అని ఆమె నిరూపించింది. అంతేకాకుండా ఈ వీడియోకు.. "కొన్నిసార్లు ఇంటర్నెట్ చాలా సీరియస్ ప్రశ్నలు అడుగుతుంటుంది. వాటికి సైన్స్ నుంచి సమాధానాలు ఆశిస్తుంది. కాస్త వ్యంగ్యం, కాస్త హాస్యం కలిపి చెప్పడం ద్వారా సెలబ్రిటీలు కూడా సాధారణ రక్తమాంసాలున్న మనుషులే అని గుర్తు చేయడానికే నేను ఇలా స్పందించాను" అని రాసుకొచ్చింది. ఇక కామాక్షి సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం 'మా ఊరి పొలిమేర-3' చిత్రంతో బిజీగా ఉన్న కామాక్షి, ఇలాంటి అసభ్యకర ప్రశ్నలను సున్నితంగా స్పందించడమే కాకుండా కౌంటర్ ఇవ్వడంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# అందుకే మా సినిమాకు 'ఏ' సర్టిఫికెట్

## 'కపుల్ ఫ్రెండ్లీ' నిర్మాత

హైదరాబాద్: ప్రేమికుల రోజు సందర్భంగా ఈ నెల 14న విడుదల కానున్న చిత్రాల్లో 'కపుల్ ఫ్రెండ్లీ' ఒకటి. సంతోశ్ శోభన్, మానస వారణాసి జంటగా అశ్విన్ చంద్రశేఖర్ తెరకెక్కించారు. టైటిల్ విషయంలో సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసిందని నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని తెలిపారు. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. "కపుల్ ఫ్రెండ్లీ.. అసభ్యకరంగా అనిపిస్తోందని చెప్పిన సెన్సార్ బోర్డు సినిమా పేరును మార్చమని సూచించింది. 'ఫ్రెండ్లీ కపుల్' పేరు పెట్టమని సలహా ఇచ్చింది. ఒకవేళ మార్చకపోతే 'ఏ' సర్టిఫికెట్ ఇస్తామని చెప్పింది. 'కపుల్ ఫ్రెండ్లీ' టైటిల్ ఇప్పటికే ప్రేక్షకులకు చేరువైంది. విడుదల తేదీ సమీపిస్తుండగా ఇప్పుడు పేరు మార్చడం సరికాదని అనిపించింది. అందుకే టైటిల్‌ను ఛేంజ్ చేయకుండా 'ఏ' సర్టిఫికెట్ తీసుకున్నాం. అంతమాత్రాన ఈ సినిమాలో అసభ్యత ఉందని అనుకుంటే పొరపాటే. ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ ఇది. ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఉంటాయి. కేవలం టైటిల్‌ని బట్టి సినిమాని తప్పుగా అర్థం చేసుకోవడం కరెక్ట్ కాదు" అని ధీరజ్ వివరించారు. క్లిష్టమైన టైటిల్ ఎందుకు పెట్టాల్సి వచ్చిందన్న ప్రశ్నపై సంతోశ్ శోభన్ స్పందించారు. "ఈ టైటిల్ ప్రేక్షకులకు రీచ్ అవుతుందా, లేదా? అని తొలుత నేనూ సందేహించా. కానీ, టీమ్‌కు నమ్మకం ఉంది. వారి వివరణతో నేను రిలాక్స్ అయ్యా. సినిమా ప్రారంభంలోనే టైటిల్‌కు జస్టిఫికేషన్ ఉంటుంది" అని అన్నారు.






# కొచ్చాడైయాన్ నిర్మాతకు మద్రాస్ హైకోర్టు నోటీసులు

## యాడ్ బ్యూరోకు రెండున్నర కోట్లు చెల్లించాలని ఆదేశం

చెక్ బౌన్స్ కేసులో 'కొచ్చడైయాన్' సినిమా (తెలుగులో 'విక్రమసింహ') నిర్మాతకు మద్రాసు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. యాడ్ బ్యూరో సంస్థకు నాలుగు వారాల్లో రూ.2.5కోట్లు చెల్లించాలని లేదంటే ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది. రజనీకాంత్ కథానాయకుడిగా ఆయన కుమార్తె సౌందర్య దర్శకత్వంలో 2014లో వచ్చిన 3డీ మోషన్ క్యాప్చర్ మూవీ 'కొచ్చడైయాన్'. దీపిక పదుకొణె కథానాయిక. ఈ సినిమా నిర్మాణ పనులకు బెంగళూరుకి చెందిన యాడ్ బ్యూరో అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి మీడియా వన్ గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ డైరెక్టర్లలో ఒకరైన మురళీమనోహర్ రుణం తీసుకున్నారు. తిరిగి చెల్లింపుల్లో భాగంగా 2014లో మురళీమనోహర్ యాడ్ బ్యూరో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అబిర్ చంద్ నహర్‌కు రూ.5 కోట్ల చెక్ ఇచ్చారు. అది బౌన్స్ కావడంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. మొదట ఈ కేసులో మురళీ మనోహర్‌కు ట్రయిల్ కోర్టు ఆరు నెలలు జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఆయన మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ఇచ్చిన గడువులోపు యాడ్ బ్యూరో అడ్వటంల్గ÷జింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.2.5 కోట్లు చెల్లించాలని లేదంటే జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని ఆదేశించింది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com